సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శుక్రవారం, 17.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 175
పేజీలు: 12 వెల: రూ. 5





## అర్హులందరికీ అక్రెడిటేషన్

- జర్నలిజంతో సంబంధం లేనివారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా చూడాలి
- ఎలైట్ పీపుల్ నుంచి జర్నలిస్టులను తొలగించాలి

09

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్

కే.శ్రీనివాస్ రెడ్డి

## దక్షిణాదికి అన్యాయం

# జరగదు

### ఏ రాష్ట్రానికీ ఇబ్బంది ఉండదు..



- రాజకీయ దురుద్దేశం లేదు.. ప్రధాని మోదీ స్పష్టీకరణ
- చట్టసభల్లో మహిళా కోటా.. వారి హక్కు, మా బాధ్యత!
- మహిళా బిల్లు సమర్థిస్తేనే రాజకీయ మనుగడ
- బిల్లును వ్యతిరేకిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు..
- క్రెడిట్ మీకే.. సహకరించండి..
- విపక్షాలకు 'బ్లాంక్ చెక్' ఆఫర్ చేసిన ప్రధాని

**ముద్ర డెస్క్ :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల సందర్భంగా లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే శక్తులను దేశంలోని మహిళలు ఎన్నటికీ క్షమించరని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఎవరైతే ఈ బిల్లును అడ్డుకుంటారో, వారు సుదీర్ఘకాలం పాటు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని ఆయన హెచ్చరించారు. గతంలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే ఏ విషయంలోనైనా అడ్డుపడిన ఏ ఒక్కరినీ మహిళలు వదిలిపెట్టలేదని ఆయన గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు అనేది ప్రభుత్వం ఇచ్చే బహుమతి కాదని, అది వారి హక్కు అని ఆ స్పష్టం చేశారు. సుమారు 25-30 ఏళ్ల క్రితమే ఈ ఆలోచన వచ్చినా, అమలులో జరిగిన ఆలస్యాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఆనాడే దీనిని అమలు చేసి ఉంటే బాగుండేదని, అయితే ఇప్పుడు దీనిని ఒక పరిణతి చెందిన దశకు తీసుకువచ్చామని చెప్పారు. దశాబ్దాలుగా మహిళలకు దక్కాల్సిన ఈ గౌరవాన్ని ఆలస్యం చేసినందుకు, ఇప్పుడు దీనిని ఆమోదించడం ద్వారా ఆ తప్పులను సరిదిద్దుకునే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అని ప్రధాని అభివర్ణించారు. కాలక్రమేణా అవసరాలకు అనుగుణంగా చట్టాలను మెరుగుపరచుకోవడమే ప్రజాస్వామ్య సౌందర్యమని ఆయన చెప్పారు. వేల ఏళ్ల మన ప్రజాస్వామ్య ప్రయాణంలో, సగం జనాభాకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఈ ప్రయాణానికి కొత్త కోణాన్ని అద్దే పవిత్ర అవకాశం ఈ సభకు లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఒకటేనని..ఉత్తరాది, దక్షిణాది తేడాలు లేవన్నారు. మిగతా 02లో

## ఇండియా–పాకిస్తాన్ లా

# తెలంగాణ విభజన

### కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ధ్వజం

డీలిమిటేషన్ బిల్లుపై తప్పుదారి

సీఎం రేవంత్ ప్రతిపాదన చూసి నవ్వుతున్నారు

03





## ఎంపీ తేజస్వీ అజ్ఞాని

### రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

03

- రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం కక్కారు
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని బీజేపీ ఎంపి తేజస్వీ దెబ్బతీశారు : హరీశ్
- భారత్-పాకిస్తాన్ తో పోల్చడం దుర్మార్గం: మాజీ మంత్రి నిరంజన్
- తేజస్వి వ్యాఖ్యలపై ఎంపీలు స్పందించాలి: కవిత

## తెలంగాణ అస్తిత్వమంటే గౌరవం లేదు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం
- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరుల త్యాగాలను అవమానించారు



03



## ఆత్మహత్యాయత్నం

### ఇందిరమ్మ ఇల్లు రాలేదని మహిళ ఆవేదన

- ప్రజాపాలనలో కలకలం..
- సూర్యాపేట కలెక్టర్, ఎస్పీల సమక్షంలో ఘటన..
- జిల్లాలో చర్చనీయాంశం
- రాజకీయ ఒత్తిడుల వల్లే ఇల్లు రాలేదని బాధితురాలి ఆరోపణ
- హుటాహుటీనా ఆస్పత్రికి తరలింపు

03

## ఎండ ప్రచండం..

### *12 జిల్లాలకు వాతావరణ శాఖ హై అలర్ట్*

- రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల దాకా చేరే సూచనలు
- వచ్చే మూడు రోజులు వడగాలుల తీవ్రత పెరుగుతుందని హెచ్చరిక
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్..
- అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఆదిలాబాద్ నుంచి గద్వాల వరకు ఎండల ఉగ్రరూపం
- బయటకు వెళ్లే వారికీ జాగ్రత్తలు అవసరం

10



## టు-లెట్ దర్జా!

### పరదాల మాటున అక్రమ నిర్మాణాలు

సీజ్ చేసిన భవనానికే టు – లెట్ బోర్డు

09

- ఇజ్జత్ నగర్ లో యథేచ్ఛగా 'ముఠా' అక్రమాలు
- మాదాపూర్ లో మున్సిపల్ అధికారుల 'మాయ'




*నియమాలు గాలికి.. నిబంధనలు తుంగలో.. అధికారుల సీజ్ బోర్డులేమో కేవలం అలంకారప్రాయం! మాదాపూర్ ఇజ్జత్ నగర్ వేదికగా సాగుతున్న ఈ అక్రమ నిర్మాణాల పర్వం మున్సిపల్ అధికారుల పని తీరుకు పరాకాష్టగా నిలుస్తోంది. ఒకవైపు ప్రభుత్వ స్థలం కబ్జా అవుతోందని ఫిర్యాదులు అందుతున్నా, మరోవైపు అధికారులు 'సీజ్' చేస్తున్నామంటూ డ్రామాలు ఆడుతున్నా.. పరదాల చాటున అక్రమ భవనం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా పూర్తయిపోయింది. ఎంతలా అంటే, అధికారులు అంటించిన సీజ్ నోటీసు కిందే.. భవన యజమాని 'టు–లెట్' బోర్డు తగిలించేంత దర్జాగా! ఇది అధికారుల చేతకానితనమా? లేక అక్రమార్కులతో కుమ్మక్కైన 'మామూళ్ల' మాయాజాలమా? సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ ముంగిట జరుగుతున్న ఈ హైటెక్ ఆక్రమణపై 'ముద్ర' కథనం.* **-ముద్ర, శేరిలింగంపల్లి:**

## లోక్‌సభలో

# బిల్లుల వేడి

### మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్



**ముద్ర డెస్క్ :** లోక్‌సభలో మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టింది కేంద్రం. 131 రాజ్యాంగ సవరణ బిల్లును అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టగా.. డీలిమిటేషన్ బిల్లును హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. అంతకు రాజ్యాంగ సవరణ బిల్లుపై లోక్ సభలో చర్చ సాగింది. బిల్లుపై చర్చించాలా వద్దా అనే దానిపై విపక్షాలు డివిజన్ కోరడంతో ఓటింగ్ జరిగింది. బిల్లుపై చర్చకు 207 మంది సభ్యులు మద్దతిచ్చారు. బిల్లును వ్యతిరేకిస్తూ 126 మంది ఓటేశారు. ఓటింగ్ సమయంలో సభలో 333 మంది ఎంపీలు ఉన్నారు. మెజార్టీ సభ్యులు మద్దతు తెలపడంతో బిల్లు ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది. అనంతరం రాజ్యాంగ సవరణ బిల్లును, డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. చర్చను ప్రారంభించిన న్యాయశాఖమంత్రి మేఘ్వాల్.. పార్లమెంటు చరిత్రలో లిఖించదగిన రోజని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి మోదీ కట్టుబడి ఉంటారన్నారు. 40 ఏళ్ల తర్వాత మోదీ నేతృత్వంలో మహిళా బిల్లు పాసైందని.. అదే స్ఫూర్తితో రిజర్వేషన్లు రాబోతున్నాయన్నారు. మిగతా 02లో

## ఎమ్మెల్యేల అనర్హతపై

# కౌంటర్ దాఖలు చేయండి

- స్పీకర్ సహా 9 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశాలు
- ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ సవాలు
- వచ్చే నెల 6 న విచారణ వాయిదా వేసిన కోర్టు

10

# సుపారీ ఇచ్చి హత్య

### ప్రియుడి కోసం భార్య పన్నాగం..

- ప్రియుడితో కలిసి కుట్ర.. 5 లక్షల సుపారీకి ఇచ్చి ప్రాణం తీసింది
- కనిపించకుండా పోయిన భర్త హత్యగా మారిన కేసు
- సుమన్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన కిరాతకురాలు
- పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిన దారుణ నిజం

10

ఏడడుగుల బంధం.. నూరేళ్ల నిండైంది. కష్టసుఖాల్లో తోడుండాల్సిన ఇల్లాలే కాలయముడైంది. పచ్చని సంసారంలో వివాహేతర సంబంధం చిచ్చు రేపగా, ఆ మోహం కళ్లు గప్పి కట్టుకున్న వాడిని కడతేర్చేలా చేసింది. ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తూ.. ప్రియుడి కోసం ప్రాణనాథుడినే సుపారీ ఇచ్చి చంపించిన ఓ భార్య ఉదంతమిది.

-ముద్ర డెస్క్

## ధోని చివరి సీజనా..?

### అభిమానుల్లో పెరుగుతున్న ఉత్కంఠ



- 44 ఏళ్ల వయసులోనూ ఐపీఎల్‌లో కొనసాగుతున్న ధోని
- గాయం చుట్టూ సందేహాలు.. ప్రకటించిన దానికంటే ఎక్కువకాలం దూరంగా ఉండటంపై చర్చలు

11

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 17.04.2026
www.mudranews.in | @mudranews




**వడదెబ్బ : వెంటనే నీడలోకి తరలించాలి**



ఎండలో ఉంటే వెంటనే చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లాలి. ఇది శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి మొదటి కీలక చర్య

# దక్షిణాదికి అన్యాయం జరగదు

(మొదటి పేజీ తరువాయి)



నియోజకవర్గాల పునర్విభజన అనగానే కొంత మంది విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే తేడాలు లేవని అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు క్రెడిట్ తమకు అవసరం లేదని.. విపక్షాలకే ఇస్తామన్నారు. వారికి ప్రచారం చేయిస్తానన్నారు. పేపర్లలో ప్రకటన ఇస్తానని హామీ ఇస్తానన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రధాని నరేంద్ర మోదీ అఖిలేష్ యాదవ్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అఖిలేష్ యాదవ్ నాకు మిత్రుడు, అందుకే ఆయన అప్పుడప్పుడు నాకు మద్దతు ఇస్తుంటారు. నేను సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గం నుండి వచ్చిన మాట నిజమే, కానీ అందరినీ కలుపుకుని వెళ్లడమే నా బాధ్యత. రాజ్యాంగం నాకు ఈ మార్గాన్ని చూపింది, నా దృష్టిలో రాజ్యాంగమే అత్యున్నతమైనదిని మోదీ వ్యాఖ్యానించారు.

# లోక్‌సభలో బిల్లుల 'వేడి'

(మొదటి పేజీ తరువాయి)

కాగా.. డీలిమిటేషన్ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్. రాజ్యాంగాన్ని ఈ ప్రభుత్వం హైజాక్ చేస్తోందని ఆరోపించి వేణుగోపాల్.. 2024లో 33% రిజర్వేషన్‌ను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లు పెట్టేందుకు ఇంత తొందర ఎందుకు అని ప్రశ్నించారు ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్. జనగణన చేస్తే కులగణన లెక్కలూ బయ టకు వస్తాయని.. కుల రిజర్వేషన్లను తప్పించుకునేందుకే బిల్లు పెడుతున్నారు ఆరోపించారు.

జనగణనతోపాటు కులగణన జరుగుతుందన్నారు అమిత్‌షా. కొంతమంది ముస్లిం మహిళల రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నారని అయితే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని ఎక్కడా లేదన్నారు. సమాజ్‌వాదీ పార్టీ తన పార్టీ టికెట్లు మొత్తం ముస్లిం మహిళలకే ఇచ్చుకున్నా కూడా తమకు అభ్యంతరం లేదన్నారు..

123 RP యాక్ట్‌కు ఈ బిల్లు వ్యతిరేకమన్నారు ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించింది డీఎంకే. ఇవి శాండ్‌విచ్ బిల్లులని విమర్శించారు ఆ పార్టీ ఎంపీ బాలు..

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా.. మూడు బిల్లులపై 12 గంటలపాటు చర్చ జరగనుంది. అవసరమైతే స్పీకర్ సమయాన్ని పొడిగించవచ్చు అని కేంద్రం పేర్కొంది. రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరగనున్నట్లు స్పీకర్ తెలిపారు.




### డీలిమిటేషన్ బిల్లుపై తమిళనాడులో నిరసనలు..

డీలిమిటేషన్ బిల్లుపై తమిళనాడులో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని.. ఉత్తరాది రాష్ట్రాల లాభపడతాయని ఆరోపిస్తున్నారు. DMK ఆధ్వర్యంలో నల్ల దుస్తులతో.. నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. నమక్కల్‌లో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే. స్టాలిన్ నల్ల దుస్తులు ధరించి నల్ల జెండా ఎగరవేశారు. అంతేకాకుండా డీలిమిటేషన్ బిల్లు ప్రతిని కూడా దహనం చేసి వ్యతిరేకతను వ్యక్తం చేశారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల స్థానాలను మార్చేందుకు ఉద్దేశించిన ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ఈ బిల్లు తీరని నష్టం చేకూరుస్తుందని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు ఈ డీలిమిటేషన్ చట్టాన్ని తక్షణమే వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆపబోమని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఇక టీవీకే అధినేత విజయ్ కూడా డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించారు. ఈ బిల్లుతో తమిళనాడు నష్టపోతుందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని అన్నారు.

# బెంగాల్‌లో మమతా బెనర్జీకి కష్టమేనా?

**ముద్ర డెస్క్:**
దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో అందిరి దృష్టి పశ్చిమబెంగాల్‌పై ఉంది. ఇక పశ్చిమబెంగాల్ ఓటర్ల దృష్టి ఈసారి మమతపై ఉంది. మమత గెలుస్తుందా.. గెలవకపోతే మమత పరిస్థితి ఏంటి అన్న చర్చ జరుగుతోంది. 15 ఏళ్ల అధికార పాలనలో కొంత వ్యతిరేకత ఏర్పడినా, ప్రజలు ఈసారి మమతా పరిస్థితినే అడుగుతున్నారు. 2021లో నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి సువెందు అధికారిని ఓడించిన మమతా, తర్వాత భవానీపూర్ ఉప ఎన్నికలో 60 వేల మెజారిటీతో గెలిచింది. కానీ ఈసారి సువెందు అధికారి నందిగ్రామ్‌తోపాటు భవానీపూర్‌లో కూడా పోటీ చేస్తున్నారు..

భవానీపూర్ ఓటర్ల లెక్కలు..
భవానీపూర్ నియోజకవర్గంలో 76 శాతం హిందువులు, 24 శాతం ముస్లింలు ఉన్నారు. వీరిలో 46 శాతం బెంగాలీలు, 34 శాతం నాన్–బెంగాలీలు (గుజరాతీలు, మార్వాడీలు, బిహార్, యూపీ నుంచి వలసలు). ఇటీవల మమతా గుజరాతీలు, హిందీ మాట్లాడేవారిపై వ్యాఖ్యలు ఈ ఓటర్లలో వ్యతిరేకత రేకెత్తించాయి. 2014 నుంచి ఇక్కడ బీజేపీ బలం పెరుగుతోంది. 2024 మున్సిపల్ ఎన్నికల్లో భవానీపూర్ వార్డుల్లో తృణమూల్ రెండో స్థానంలో నిలిచింది, బీజేపీ గెలిచింది.

47 వేల ఓటర్ల తొలగింపు..
ఈసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మమత సొంత నియోజకవర్గం భవానీపూర్‌లో 47 వేల ఓట్లు తొలగించారు. ముఖ్యంగా 14 వేల ఓట్లపై జుడీషియల్ అడ్యుకేషన్ జరగాలి. మొత్తం ఓటర్లు తగ్గడంతో మమతా మెజారిటీ కన్నా 4 వేల ఓట్లు తగ్గాయి. 47 వేలలో మమతకు ఓటు వేసేవారు, బీజేపీ ఓటర్లు కూడా ఉన్నారు. ఈ మార్పులు మమతా గెలుపును కష్టతరం చేశాయి.

భవానీపూర్ ఎన్నిక ఈసారి మమతా బెనర్జీ వ్యక్తిగత ప్రతిష్టాత్మక పోరు. 15 ఏళ్ల పాలనలో వ్యతిరేకత, ఓటర్ లిస్ట్ మార్పులు, స్థానిక ఎన్నికల ఓటమి, సువెందు డబుల్ పోటీ – అన్నీ మమతా మెజారిటీని సంక్షోభంలోకి నెట్టాయి. గెలిస్తే తృణమూల్ బలపడుతుంది, ఓడితే మమతా రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ఈ ఎన్నిక బెంగాల్ రాజకీయాలను మతులపు తిప్పనున్నాయి.



# ఒక్క కుక్క కాంగ్రెస్‌ను అధికారంలోంచి దించేసింది

## అస్సాంలో మార్పు వెనుక ఒక హీరో



**ముద్ర డెస్క్ :**
మహాభారతం కుక్కతో మొదలై.. కుక్కతో ముగిసింది అంటారు. అస్సాం రాజకీయాలను కూడా ఓ కుక్క మలుపు తిప్పింది. పదేళ్లు కాంగ్రెస్‌కు అధికారాన్ని దూరం చేసింది. హిమంత బిశ్వశర్మను హీరోను చేసింది. 2014లో అస్సాం ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్, హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి సిద్ధిజోషి, పీసీసీ చీఫ్‌లు రాహుల్ గాంధీని కలవడానికి వెళ్లారు. చాయ్, బిస్కెట్లు సర్వీస్ అయ్యాయి. చర్చ జరుగుతుండగా రాహుల్ పెంపుడు కుక్క వచ్చింది. ఆయన వెంటనే నేతలతో మాట్లాడటం పక్కనపెట్టి, కుక్కతో ఆడుకోవడం మొదలుపెట్టారు. కుక్క ప్లేట్‌లోని బిస్కెట్లు తినడంతో మిగతా నేతలు కూడా తిన్నారు. కానీ హిమంత బిస్కెట్లు తినలేదు. 'నేను అలాంటివి తినను' అని చెప్పి బయటకు వచ్చాడు. ఈ అవమానకర సంఘటన హిమంత రాజకీయ జీవితంలో టర్నింగ్ పాయింట్ అయింది.

### కాంగ్రెస్‌కు రాజీనామా..

కొన్ని రోజుల్లోనే హిమంత బిశ్వశర్మ మంత్రి పదవి, కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. తర్వాత బీజేపీలో చేరి, 2019 ఎన్నికల్లో క్యాంపెయిన్ కమిటీ చైర్మన్‌గా నియమితుడయ్యాడు. 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన అస్సాం రాజకీయాల్లో బలమైన పట్టు కలిగి ఉన్నాడు. బీజేపీ బంపర్ మెజారిటీతో గెలిచింది. సర్బానంద సోనోవాల్ సీఎంగా నాలుగేళ్లు పాలించిన తర్వాత, 2021లో హిమంతకు అవకాశం కల్పించారు.

### అస్సాం సీఎంగా విజయ యాత్ర..

హిమంత సీఎంగా ఒక సంవత్సరంలోనే 2026 ఎన్నికలు వచ్చాయి. గత ఎన్నికల కంటే ఎక్కువ సీట్లతో బీజేపీ మరోసారి గెలిచింది. ఐదేళ్ల పాలన పూర్తయ్యాక మళ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అంచనాలు బీజేపీ మంచి మెజారిటీతో గెలుస్తుందని చెబుతున్నాయి. 2014 నుంచి 12 ఏళ్లలో కాంగ్రెస్ అధికారం దూరంగా ఉంది.

### కుక్క సంఘటన కీలకం..

రాహుల్ నిర్లక్ష్యం హిమంతను కాంగ్రెస్‌కు వ్యతిరేకించింది. బీజేపీలో చేరడం అస్సాం రాజకీయాలను మార్చింది. 2016, 2021, 2026లో బీజేపీ ఘన విజయం హిమంత నాయకత్వానికి సాక్ష్యం. ఒక్క నాయకుడు దూరమైనా, పార్టీ 12 ఏళ్లుగా విపక్షాల్లో ఉంది. హిమంత అస్సాం రాజకీయాల్లో బలవంతుడు. ఈ సంఘటనను ఆయన పబ్లిసిటీగా ఉపయోగించుకుని ప్రజల్లో సానుకూల చిత్రం ఏర్పరిచాడు.

మహాభారతం కుక్కతో మొదలై ముగిసినట్లు, హిమంత రాజకీయ జీవితం కుక్క బిస్కెట్ సంఘటనతో మలుపు తిరిగింది. రాహుల్ చిన్న నిర్లక్ష్యం కాంగ్రెస్‌ను అస్సాం అధికారం నుంచి దూరం చేసింది. హిమంత సీఎంగా 3సార్లు బీజేపీ విజయం సాధించడం రాజకీయ చరిత్రలో అమోఘ సంఘటన. ఒక్క క్షణం నిర్ణయాత్మకంగా మారి దశాబ్దాల రాజకీయాలను మార్చేసింది!

# అప్పు ఇచ్చిన సౌదీ.. లాగేసిన యూఏఈ

## సౌదీ వద్ద అడుక్కొని యూఏఈకి చెల్లించిన పాకిస్తాన్

**ముద్ర డెస్క్ :**
పాకిస్తాన్.. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళు అయినా.. ఆ దేశం ఇప్పటికీ అప్పుల మీద ఆధారపడే బతుకుతోంది. అభివృద్ధికన్నా.. ఉగ్రవాదానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడమే ఈ పరిస్థితికి కారణం. అపారమైన వనరులు, సారవంతమైన భూములు ఉన్నా.. జనాభా పెరుగుదల, రాజకీయ అస్థిరత, సైనిక జోక్యం, ఉగ్రవాదం ఆదేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన పాకిస్తాన్‌కు పశ్చిమాసియా యుద్ధం మరింత ఇబ్బందికరంగా మారింది. యుద్ధంలో ఎవరి పక్షాన నిలవాలో తెలియని సందిగ్ధంలో ఉంది. యూఏఈతో డిఫెన్స్ డీల్ ఉంది. దాని ప్రకారం పాకిస్తాన్ ఇరాన్‌పై యూఏఈ తరఫున దాడి చేయాలి. కానీ సైలెంట్‌గా ఉంటోంది. దీంతో యూఏఈ తాము ఇచ్చిన 2 బిలియన్ డాలర్ల అప్పు తీర్చాలని పాకిస్తాన్‌పై ఒత్తిడి చేస్తోంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా 3 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం ప్రకటించింది. తాజాగా 2 బిలియన్ డాలర్లు పాక్‌కు అందాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్ ఈ విషయాన్ని ధ్రువీకరించి, ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మార్చి 27 నాటికి పాక్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. ఈ సాయంతో ఆర్థిక ఒత్తిడి తాత్కాలికంగా తగ్గనుంది.

### యూఏఈ షాక్..

సౌదీ సహాయం ఆనందంలో మునిగి ఉన్న పాక్‌కు యూఏఈ తీవ్ర ఒత్తిడి తెచ్చింది. గతంలో యూఏఈ నుంచి తీసుకున్న 3.5 బిలియన్ డాలర్ల (రూ.32 వేల కోట్లు) రుణాన్ని ఈ నెలలోనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేసింది. పాక్ ప్రభుత్వం ఈ రుణాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. సౌదీ సహాయంతో ఈ నెలాఖరులోగా చెల్లించే అవకాశం ఉంది.

### షెహబాజ్ సౌదీ పర్యట..

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. బుధవారం క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌ను కలిసి, ద్వైపాక్షిక ఆర్థిక, రక్షణ అంశాలపై చర్చించారు. మరో బిలియన్ డాలర్ల సాయం, రుణాల పొడిగింపు కోరికలు చర్చల్లో ఉన్నాయని సమాచారం.

### ఆర్థికంగా కుదేలైన పాకిస్తాన్..

పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుదేలైంది. విదేశీ ఋణాలు జీడీపీకు 90 శాతంకు పైగా ఐఎంఎఫ్, చైనా, సౌదీ, యూఏఈపై ఆధారపడి ఉంది. మారక నిల్వలు 16.4 బిలియన్ డాలర్లు 3 నెలల ఇంపోర్ట్‌కు సరిపోతాయి. యూఏఈ రుణం చెల్లించడంతో మరింత క్షీణించనున్నాయి. సౌదీ 2023 నుంచి 5 బిలియన్ డాలర్లు సాయం. ఇది తాత్కాలిక ఊపిరి. యూఏఈ రుణం తిరిగి తీర్చమంటూ ఒత్తిడి పెంచడం పాక్‌కు షాక్ ఇచ్చింది. పాకిస్తాన్ అప్పుల ఊబిలో మునిగిపోతోంది. సౌదీ 2 బిలియన్ సాయం తాత్కాలిక ఊపిరి ఇచ్చినా, యూఏఈ 3.5 బిలియన్ రుణ ఒత్తిడి కొత్త సమస్య. మారక నిల్వలు క్షీణిస్తుండగా, షెహబాజ్ సౌదీ పర్యటలో మరిన్ని సాయాలు కోరుతున్నారు. ఐఎంఎఫ్, చైనా మీద ఆధారపడి ఉన్న పాక్, స్థిరమైన సంస్కరణలు చేయకపోతే పరిస్థితి మరింత దిగజారుతుంది.



# ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య సీజ్ ఫైర్

**ముద్ర డెస్క్ :**
ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. శాంతి నెలకొల్పడంలో భాగంగా 10 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు చెప్పారు. ఈ శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్, లెబనాన్‌లతో కలిసి పనిచేసే బాధ్యతను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు అప్పగించానని అన్నారు. అయితే, ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల ప్రతినిధులు 34ఏళ్ల తర్వాత వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ అయ్యారని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో మాట్లాడానని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది యుద్ధాలు ఆపడం తనకు దక్కిన గౌరవమని.. ఇది పదోది కాబోతోందంటూ ట్రంప్ స్వయంగా ప్రకటించుకోవడం గమనార్హం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వడదెబ్బ : బిగుతైన దుస్తులు విప్పాలి**

బిగుతైన దుస్తులు గాలి ఆడకుండా చేస్తాయి. వాటిని విప్పితే శరీరం త్వరగా చల్లబడుతుంది.




## తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

- **బీజేపీ ఎంపి తేజస్వీ సూర్యపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం చారిత్రక తప్పిదమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. బాధ్యతాయుత హోదాలో కొనసాగుతూ ఈ వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపి తేజస్వీ సూర్య.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. అయన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ ఆవిర్భావంతో పోల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారజ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఇది భారత సమాఖ్య స్ఫూర్తి పట్ల బీజేపీకి ఉన్న అజ్ఞానాన్ని సూచిస్తోందని విమర్శించారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, విద్యార్థులు, యువకులు మరియు అమరుల బలిదానాల ఫలితంగా తెలంగాణ సిద్ధించిందని బీఆర్ఎస్ గుర్తు చేశారు. భారత రాజ్యాంగ పరిధిలోనే శాంతియుత మార్గంలో పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని, రక్తసిక్తమైన విభజన (పాకిస్థాన్ ఏర్పాటు)తో పోల్చడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. 2014లో తెలంగాణ ఏర్పాటు అనేది ప్రజా ఆకాంక్షల ప్రతిరూపమని, దీనిని తక్కువ చేసి మాట్లాడటం ప్రాంతీయ ఉద్యమాలపై బీజేపీకి ఉన్న చులకన భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, బీజేపీ వెంటనే తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. "రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను సహించేది లేదు. తెలంగాణ చరిత్రను, గౌరవాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని హరీష్ రావు స్పష్టం చేశారు.

## ఎంపీ తేజస్వీకి అవగాహన లేదు

- **రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం దుర్మార్గం**
- **తేజస్వి.. చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నారు**
- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. బాధ్యతాయుత హోదాలో ఆయన తేజస్వి.. చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తీరును భారత్‌పాకిస్తాన్ విభజనతో పోల్చడం దుర్మార్గం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏదో యాదృచ్చికంగా ఏర్పడింది కాదన్న ఆయన ఇది కొన్ని దశాబ్దాల పాటు సాగిన ప్రజా ఉద్యమం అని చెప్పారు, వేలాది మంది అమరుల త్యాగాలు, కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ఫలితమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం భారత రాజ్యాంగం ప్రకారం, పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో ఏర్పడిందని వివరించారు. దేశ అత్యున్నత చట్టసభ ఆమోదించిన బిల్లు ద్వారా ఏర్పడిన రాష్ట్రాన్ని, దేశ విభజనతో పోల్చడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని కించపరిచేలా మాట్లాడటం తెలంగాణ సమాజాన్ని కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం చరిత్రను, ప్రజల సెంటిమెంట్లను వాడుకోవడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తేజస్వీ సూర్యకు తగదని, తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## డీలిమిటేషన్ బిల్లుపై తప్పుదారి

- **సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారు**
- **ప్రతిపక్షాపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ధ్వజం**

**న్యూ ఢిల్లీ :**

డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఎలాగైనా అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. అది ఆలస్యమయ్యేలా చేసేందుకే ప్రతిపక్షాలు కొత్త దారులు వెతుకుతున్నాయని ఆయన మండిపడ్డారు. గురువారం లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా తేజస్వీ..సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు, రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీట్ల సంఖ్యను జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న రేవంత్ రెడ్డి సలహా అత్యంత మూర్ఖత్వంగా ఉందన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరు ఇచ్చారో అర్థం తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన రాష్ట్ర విభజన తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి ఏటా మారుతూ ఉంటుందన్న ఆయన.. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవడం హాస్యాస్పదమని చెప్పారు. ఆదాయం ప్రకారమే ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలని అనుకుంటే, దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుందని సెటైర్లు వేశారు. గతంలో కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఉందని.. ఏపీ విభజనను పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని ఆయన విమర్శించారు.

# తెలంగాణ అస్తిత్వమంటే బీజేపీకి గౌరవం లేదు

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం**
- **తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరుల త్యాగాలను అవమానించారు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ అస్తిత్వంపై బీజేపీ పార్టీ, నేతలకు గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమన్నారు.ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని నేడు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ... బిజెపి చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బిజెపి పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బిజెపి అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.



# ఎంపీ తేజస్వీ ఓ అజ్ఞాని

- **రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం కక్కారు**
- **ఆయన సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేసి.. చర్యలు తీసుకోవాలి**
- **రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపి తేజస్వీ సూర్య అజ్ఞానంగా మాట్లాడారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. తేజస్వీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ లోక్ సభలో ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ అని ఘాటు వ్యాఖ్యలతో మండిపడ్డారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. తేజస్వీ మాటలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు తెలంగాణ బిడ్డలైతే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇది ఏ ఒక్కరికో అవమానం కాదని ఇది మన ఉద్యమాన్ని, మన రాష్ట్రాన్ని అమానించడమేనన్నారు. మరొకరు తెలంగాణ ఏర్పాటుపై నోరువిప్పే ధైర్యం చేయకుండా చట్ట ప్రకారం బుద్ధి చెప్పాల్సి ఉందన్నారు. దీనిపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలన్నారు. తేజస్వీ సూర్యపై చర్య తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ కు లేఖ రాస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అంటే తల్లిని అమానించడమేనని పొన్నం చెప్పారు. నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి నేడు తెలంగాణ తల్లిని అవమానిస్తే మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు. ప్రధాని మోడీ, అమిత్ షా, ఇప్పుడు తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై తప్పుడుగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా ఓ టీడీపీ ఎంపీ సైతం ఇదే రకంగా మాట్లాడారని ఇటువంటి అజ్ఞానులు, ధన బలం, మందబలంతోనో పార్లమెంట్ కు వస్తే అలాంటి వారి పార్టీ అయినా బుద్ధి చెప్పాలి కదా అన్నారు. సహృద్భావ వాతావరణంలో బతకాల్సిన పరిస్థితుల్లో తెలంగాణ ఏర్పాటుపై అనుచితంగా మాట్లాడుతూ పుడుమీద కారం చల్లినట్లు వ్యవహిస్తున్నారని మండిపడ్డారు.

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

- **సూర్యాపేట కలెక్టర్, ఎస్పీ సమక్షంలోనే పురుగుల మందు తాగిన మహిళా**
- **హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు**

**ముద్ర, సూర్యాపేట :**



సూర్యాపేట జిల్లాలో సంచలనం రేగింది. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో తనకు అన్యాయం జరిగిందంటూ ఓ మహిళ ఆ జిల్లా జిల్లా కలెక్టర్, ఎస్పీల సమక్షంలోనే పురుగుల మందు తాగింది. వివరాల్లోకి వెళితే.. మునగాల మండల పరిధిలోని తాడువాయి గ్రామానికి చెందిన కోట సునీత అనే మహిళ, ఇందిరమ్మ కాలనీ ఇళ్ల పంపిణీలో తనకు ఇల్లు కేటాయించలేదని గత కొంతకాలంగా ఆవేదన చెందుతోంది. తనకు ఇల్లు రాకుండా స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై అడ్డుపడుతున్నారని ఆమె ఆరోపిస్తోంది. ఈ క్రమంలో గురువారం మునగాల మండల కేంద్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత వేదిక వద్దకు వెళ్లి తన గోడును వెళ్లబోసుకునే ప్రయత్నం చేసింది. అధికారులకు తన సమస్యను వివరిస్తూనే, వెంట తెచ్చుకున్న పురుగుల మందును ఒక్కసారిగా కలెక్టర్, ఎస్పీ ముందే తాగేసింది. ఈ హఠాత్పరిణామంతో షాక్‌కు గురైన పోలీసులు, అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. స్పృహ కోల్పోతున్న సునీతను వెంటనే పోలీసు వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు అత్యవసర చికిత్స అందుతోంది. రాజకీయ అండదండలు ఉన్నవారికే సంక్షేమ పథకాలు కట్టబెడుతున్నారని, అర్హులైన తమలాంటి వారికి అన్యాయం చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు తనకు రావాల్సిన ఇల్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించింది. జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# భారీగా విదేశీ కరెన్సీ పట్టివేత

- **శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో రూ.45 లక్షలు సీజ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా జరుగుతున్న అక్రమ కరెన్సీ రవాణాకు కస్టమ్స్ అధికారులు మరోసారి బ్రేక్ వేశారు. హాంకాంగ్‌కు అక్రమంగా విదేశీ కరెన్సీని తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శంషాబాద్ గురువారం ఎయిర్‌పోర్ట్ నుంచి హాంకాంగ్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు, అతడి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సదరు ప్రయాణికుడి వద్ద ఎలాంటి అనుమతులు లేని సుమారు రూ.45 లక్షల విలువైన విదేశీ కరెన్సీని గుర్తించారు. బ్యాగుల్లో అత్యంత చాకచక్యంగా దాచి తరలించే ప్రయత్నం చేసినట్లుగా సమాచారం. పట్టుబడిన నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, విదేశీ కరెన్సీ నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అంత భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు..? దీని వెనుక ఏదైనా హవాలా ముఠా ఉందా? అనే కోణంలో అధికారులు సదరు ప్రయాణికుడిని విచారిస్తున్నారు



## దేశాన్ని విభజించే కుట్ర

- **కాంగ్రెస్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెడుతోన్న బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరన్న రాంచందర్ రావు.... సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

## బీజేపీ ది రెండు నాల్కల ధోరణి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దశాబ్దాల పోరాటాలు, వందలాది మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఒక దేశ విభజన నాటి రక్తపాతంతో పోల్చడం అత్యంత హేయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. ఒకవైపు తామే తెలంగాణ ఇచ్చామని, ఇక్కడ 'విమోచన దినోత్సవాలు' జరుపుకుంటామని చెప్పుకునే బీజేపీ నాయకులు పార్లమెంటులో మాత్రం రాష్ట్ర ఏర్పాటును అవమానపరిచేలా మాట్లాడటం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనమని చెప్పారు. నాడు బిల్లుకు మద్దతు పలికిన వెంకయ్య నాయుడు, సుష్మా స్వరాజ్ వంటి నేతల నిర్ణయాలను ఇప్పుడు తేజస్వీ సూర్య తప్పుబడుతున్నారా? అని ప్రశ్నించారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని, పాకిస్తాన్‌ను విడగొట్టిన పద్ధతిలోనే ఆంధ్రాతెలంగాణ విభజన జరిగిందని తేజస్వీ సూర్య మాట్లాడటం ఆయన అజ్ఞానానికి, తెలుగు ప్రజల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రులుగా ఉన్న తెలంగాణ బీజేపీ నేతలు తమ పార్టీ ఎంపీ రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కూడా ఈ వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తెలుగు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి '.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు .. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు,సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# దానవుల చేతుల్లో "భూదాన్" భూములు

## ఉవ్వెత్తున ఎగిసిపడిన "భూదాన్ యజ్ఞానికి" నేటికీ 75 ఏళ్ళు నిండాయి

1951వ దశకంలో ఉవ్వెత్తున ఎగిసిపడిన ప్రజా ఉద్యమ కెరటం "భూదాన్ యజ్ఞం". స్వాతంత్ర్యం అనంతరం ప్రజలలో దేశ భక్తిని, సమానత్వాన్ని చాటి చెప్పడానికి బాగా సహకరించిన సానుకూల సందర్భం. ఇదే స్ఫూర్తితో భారత దేశ వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు దాతృత్వంతో "భూదాన్ యజ్ఞానికి" దానం చేసిన "భూదాన్ భూములు" ఇప్పుడు దానవుల చేతుల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. భూమి లేని నిరుపేద ప్రజలను భూమి యజమానులుగా చేయాలన్న ఆచార్య వినోబా భావే దృఢ సంకల్పం మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఘోర పరాభవానికి గురవుతున్నది. కంచె చేను మేసింది అన్న చందంగా భూదాన్ భూములను సంరక్షించాల్సిన ప్రభుత్వాలు భూదాన్ భూములను ప్రభుత్వ భూములుగా మార్చివేసి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్నాయి.

స్వాతంత్ర్యం సిద్ధించుకున్న భారతావనిలో ప్రజా జీవనంలో ఆర్థిక తారతమ్యాలు తొలగిపోవాలంటే భూమి లేని బడుగు బలహీన వర్గాల సామాన్య ప్రజలు భూమి యజమానులుగా మారాలన్న ఏకైక లక్ష్యంతో ఆచార్య వినోబా భావే తలపెట్టిన "భూదాన్ యజ్ఞం" దేశంలోని మూడవ వంతు భూభాగాన్ని కదిలించింది. ఆయన తన పాద యాత్ర ద్వారా వేలాది కిలోమీటర్లు ప్రయాణించి, వందలాది ప్రాంతాలను సందర్శించి, లక్షలాది మంది రైతులను కదిలించి, సుమారు 50 లక్షల ఎకరాల భూములను తన భిక్షాటన ద్వారా సేకరించారు. 1951వ దశకంలో ప్రారంభమై, కొన్ని సంవత్సరాల కాలంపాటు కొనసాగిన "భూదాన్ యజ్ఞం" సామాన్య ప్రజా చైతన్యానికి నూతన శ్రీకారం చుట్టింది.

అయితే ఆచార్య వినోబా గారి కాలంలో పంచబడిన భూదాన్ భూములను కూడా ఇప్పటికీ ప్రభుత్వాలు క్రమబద్ధీకరించకపోవడంతోనూ, భూదాన్ భూములపైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనూ, స్వయంగా ప్రభుత్వాలే భూదాన్ భూములను స్వాహా చేస్తుండడంతోనూ దీనిని ఆసరాగా చేసుకొని భూబకాసురుల, రియల్ మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. "భూదాన్" లక్ష్యాన్ని, చట్టం యొక్క నిబంధనలను తొక్కుకుంటూ వెళ్లి భూదాన్ భూములను కబ్జా చేస్తున్నారు. వాళ్లకు మేమైనా తక్కువా అంటూ చట్టాలను సంరక్షించాల్సిన ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు కూడా భూదాన్ భూములను దొడ్డి దారుల్లో దక్కించుకునేందుకు తెగబడుతున్నారు. తాజాగా తెలంగాణా రాష్ట్రంలో అత్యంత విలువైన భూదాన్ భూములను దొడ్డి దారిలో పలువురు ఉన్నత అధికారులు రిజిస్ట్రేషన్స్ చేయించుకున్నవైనం తెలంగాణ హైకోర్ట్ జోక్యంతో వెలుగులోకి వచ్చింది. ఇంకా వెలుగులోనికి రాకుండా రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లోనూ, కబ్జాదారుల కోరల్లోనూ చిక్కుకుపోయిన అనేక సంఘటనలున్నాయి. ఇలా అన్ని విధాలుగా భూదాన్ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి.

దాంతో ఒక ఉక్కు మనిషి దృఢ సంకల్పం అడుగడుగునా అబాసుపాలవుతుంది. సమాజ హితం కోరి ఆచార్య వినోబా చేసిన జీవిత కాలపు త్యాగానికి విలువ లేకుండా పోయింది. రాజ్యాంగబద్ధమైన గెజెట్ ద్వారా ప్రభుత్వ రికార్డుల్లో, ప్రభుత్వ సంరక్షణలో భద్రముగా ఉండవలసిన భూదాన్ భూములు ఇప్పుడు భూబకాసురుల చేతుల్లో విచ్చలవిడిగా అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. వాటిని నేరుగా సంరక్షించగలిగిన భూదాన్ యజ్ఞ బోర్డులు రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అమలులో లేవు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వాలు ఆసక్తి చూపకపోగా, భూదాన్ భూములను ఎలా కాజేయాలా అని యోచించడం ఎంతో బాధాకరమైన విషయం.

### క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న "భూదాన్ భూములు"

భారత దేశంలోని మహరాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్ ఘడ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ లాంటి పలు రాష్ట్రాలలో 1965 'భూదాన్-గ్రామదాన్' చట్టం ఎంతో పటిష్టంగా అమలు జరుగుతోంది. కానీ మన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోపాటు కొన్ని రాష్ట్రాలలో మాత్రం చాలా విభిన్నమైన గడ్డు పరిస్థితులు ఈ చట్టాన్ని పూర్తిగా మరుగున పడేశాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 'భూదాన్ యజ్ఞ బోర్డు' కార్యకలాపాలు ఎలా జరిగాయి, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో ఎలా జరుగుతున్నాయి అనే కోణంలో గనుక మనం పరిశీలన చేసినట్లయితే మన తెలుగు రాష్ట్రాలలో ఈ చట్టానికి ఎన్ని తూట్లు పడ్డాయో చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

భూదాన్ ఆవిష్కర్త ఆచార్య వినోబా భావే తన మరణానికి ముందు ఆయన ఒక వీలునామా వ్రాశారు. దాని ద్వారా తన మరణానంతరం భూదాన్ భూములపైనా, భూదాన్ యజ్ఞ బోర్డు నియామకంపైనా సర్వాధికారాలు 'సర్వ సేవా సంఘ్' అనగా వార్ధాలోని అఖిలభారత సర్వోదయ మండల్ కి చెందుతాయని నిర్ధారించారు. ఈ వీలునామా ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న భూదాన్ భూములపైన, భూదాన్ యజ్ఞ బోర్డు నియామకాలపైన సర్వ సేవా సంఘ్ సర్వాధికారాలు కలిగి ఉంది. దీనిని దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి దానినే పాటిస్తున్నాయి. కానీ ఒక ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం సర్వ సేవా సంఘ్ సంబంధం లేకుండా దొడ్డి దారిన 1988లో ఒకసారి, 2012లో ఒకసారి అడ్డగోలుగా అప్పటి ప్రభుత్వాల యొక్క సొంత నిర్ణయాలతో భూదాన్ యజ్ఞ బోర్డులను నియమించడం జరిగింది.

దీనిని తీవ్రంగా పరిగణించిన సర్వ సేవా సంఘ్ న్యాయస్థానాల ద్వారా న్యాయాన్ని పొందుకునే లోపు ఆయా బోర్డుల కాలపరిమితి ముగిసిపోవడంతో న్యాయ స్థానాలు ఇచ్చిన తీర్పులను కూడా ఆయా ప్రభుత్వాలు తుంగలో తొక్కేసాయి. ఆ రెండు బోర్డుల పదవీ కాలాలలోనే అనేక వేల ఎకరాల భూములు అక్రమంగా చేతులు మారిపోయాయి. నిరుపేద కుటుంబాలకు చెందాల్సిన భూదాన్ భూములు రాజకీయ అక్రమార్కుల కబంధ హస్తాలలోకి వెళ్ళిపోయాయి. 1966' భూదాన్-గ్రామదాన్' చట్టం యొక్క నియమ బంధనలతో సంబంధం లేకుండా, వారికి ఇష్టం వచ్చిన వారికి ఈ బహుములను కేటాయించేసి, ఎటువంటి తీర్మానాలు, గెజిట్ సవరణలతో సంబంధం లేకుండా పూర్తి చట్ట వ్యతిరేకముగా వారికి వారే వేలాది ఎకరాల భూములు పంచేసుకున్నారు. అయితే ఇదంతా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు పరిస్థితి.



రాష్ట్ర విభజన తర్వాతా తెలంగాణ ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును శాశ్వతంగా రద్దు చేసేసి భూదాన్ భూములపైన పూర్తి గుత్తాధికారాన్ని ప్రకటించేసుకుంది. రెవిన్యూ అధికారులకే సర్వాధికారాలు కట్టబెట్టి, ఇప్పుడు భూదాన్ భూములన్నిటినీ ప్రభుత్వ భూములుగా నోటిపై చేసేందుకు కసరత్తులు చేస్తుంది. ఇక ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అయితే అసలు భూదాన్ భూములంటే ఏమిటి అని ఎదురు ప్రశ్న వేసే పరిస్థితిలో ఉంది. అంటే గత 10 ఏళ్లలో ఆ స్థాయిలో భూదాన్ భూములు మాయమైపోయాయన్నమాట. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అయితే భూదాన్ భూములకు కనీసం లెక్కా పత్రం కూడా లేదు. ఈ భూదాన్ భూములకు పూర్తి స్థాయిలో అండగా నిలబడి ఆ భూములను సంరక్షించాల్సిన ప్రభుత్వాలు ఈ స్థాయిలో అలసత్వాన్ని ప్రదర్శిస్తుంటుంటే ఆచార్య వినోబా చేసిన త్యాగానికి, ఆయన లక్ష్యానికి ప్రభుత్వాలు ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నాయో మనం అర్థం చేసుకోవచ్చు.

1965 'భూదాన్-గ్రామదాన్' చట్టం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అమలులోకి వచ్చినప్పుడు ఈ రాష్ట్రంలో సుమారు 2 లక్షల ఏభై వేల పైచిలుకు ఎకరాలు భూదాన్ భూములు ఉన్నట్లుగా 'గెజిట్'లో నమోదు చేయబడ్డాయి. 1982లో ఆచార్య వినోబా భావే మరణం సంభవించే నాటికి దాదాపు 40 వేలఎకరాల భూములు మాత్రమే ఈ రాష్ట్రంలో పారదర్శకంగా భూమి లేని నిరుపేదలకు పంచబడ్డాయి. మిగిలిన భూములన్నీ ప్రభుత్వ సంరక్షణలోనే ఉన్నాయి. అయితే 2014లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విభజించబడినప్పుడు సుమారు 80 వేల ఎకరాల భూదాన్ భూములు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనూ, సుమారు 1 లక్షా 30 వేల ఎకరాల భూదాన్ భూములు తెలంగాణ రాష్ట్రంలోనూ ఉన్నట్లుగా లెక్కలు చూపించారు. 2014 తరువాత ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా ఇప్పటి వరకూ 'భూదాన్ యజ్ఞ బోర్డు'ల నిర్మాణం జరగలేదు. అయితే 2023లో మాత్రం ఆంధ్ర ప్రదేశ్లో అధికారంలో ఉన్న అప్పటి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్వ సేవా సంఘ్ సిఫారసు లేకుండా తమ పార్టీకి చెందిన ఒక వ్యక్తిని కేవలం ఛైర్మన్ గా మాత్రం నియమిస్తూ, భూదాన్ యజ్ఞ బోర్డును నియమిస్తున్నట్లుగా ప్రత్యేక గెజిట్ ను తీసుకొచ్చింది. ఈ విషయం సర్వ సేవా సంఘ్ దృష్టికి వెళ్ళడంతో దీనిని సవాలు చేస్తూ వారు ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయ స్థానం ఆ గెజిట్ను రద్దు చేస్తూ, సర్వ సేవా సంఘ్ సిఫారసు లేకుండా భూదాన్ యజ్ఞ బోర్డు నిర్మాణం సాధ్యం కాదని, 2023లో ప్రభుత్వం విడుదల చేసిన ఆ గెజిట్ చెల్లదని దానిని కొట్టివేస్తూ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఒక సంచలన తీర్పును వెలువరించింది.

తఇదిలా ఉండగా ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు ప్రభుత్వ నిర్లక్ష్యంతో, దుర్నీతితో అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి. ఈ భూములు చట్ట ప్రకారం ఎప్పటికీ ఎవ్వరికీ బదలాయించబడవని రాజకీయ నాయకులకు, అధికారులకు ఖచ్చితంగా తెలిసినప్పటికీ ఆ భూముల ధరలు ఆకాశానికి అంటడంతో వారు మరింత దురాగతాలకు పాల్పడుతున్నారు. వాటిని దక్కించుకోవడానికి అనేక విధాలుగా దొడ్డి దారుల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఈ భూములకు పూర్తి సంరక్షణ బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు అడ్డుకట్టలు లేకుండా పోతున్నాయి. కొంత శాతం భూములైతే ఇంకా దాతల వారసుల గుప్పిట్లోనే ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. వాటిని దానం చేసిన దాతల వారసులు, వారి పేరు చెప్పుకునే (వారసుల ముసుగులో) డూప్లికేట్ వారసులు ఆ భూములను సొంతం చేసుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

అయితే ప్రజలందరూ గ్రహించాల్సిన విషయమేమిటంటే భూదాన్ భూములపై చేయబడ్డ ప్రత్యేకమైన గెజిట్ (రాజపత్రం) ప్రకారం ఆ భూములు ఎప్పటికైనా సర్వ సేవా సంఘ్ నకు చెందవలసినవే గాని, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికీ బదలాయించబడవు. సర్వ సేవా సంఘ్ భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా చట్ట ప్రకారంగా స్వచ్ఛందంగా ఎవరికైనా వితరణ చేయాలి, లేదా నిరుపేదల అవసరాల కోసం ప్రభుత్వం కోరితే సర్వ సేవా సంఘ్ అనుమతించాలి తప్ప 1965 'భూదాన్ -గ్రామదాన్' చట్టంలో మరే ఇతర మార్పులు చేయడానికి ఎటువంటి సౌలభ్యం లేదు.

దీనిని ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ విషయాన్ని గుర్తించి, ఒక మహోన్నత ఆశయంతో, ధృడ సంకల్పంతో ఆచార్య వినోబా భావే యజ్ఞంగా భావించి కొనసాగించిన 'భూదాన్' ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని, ఆయన గౌరవార్థం రెండు తెలుగు రాష్ట్రాలలో 'భూదాన్' యజ్ఞ బోర్డు'లు ఏర్పాటు చేసి ఇంకా మిగిలి ఉన్న భూదాన్ భూములను నిరుపేద ప్రజలకు పంచేందుకు చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని కోరుకుందాం.



- నీలం రాంబాబు నాయుడు
అధ్యక్షులు : ఆంధ్ర ప్రదేశ్ సర్వోదయ మండల్,
విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్.
8977247578

# మంగళకరమైన మాసం వైశాఖం



సంవత్సరంలో రెండవ మాసమైన వైశాఖానికి ప్రత్యేకత ఉంది. వైశాఖ మాస ప్రాతఃకాల స్నానాచరణకాక, ఈ మాసంలో ఎన్నో జయంతులు జరపడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది. వైశాఖ శుద్ధ తదియ బలరామ జయంతి, పంచమి శంకర భగవత్పాదుల జయంతి, షష్టి రామానుజా చార్యుల జయంతి, ద్వాదశి పరశురామ జయంతి, చతుర్దశి నరసింహ జయంతి, వైశాఖ పూర్ణిమ బుద్ధ జయంతి, శరభ జయంతి, కూర్మ జయంతి, వైశాఖ బహుళ విదియ నాడు నారద జయంతిలు జరుపు కోవడం జరుగుతున్నది.

వైశాఖ శుద్ధ పాడ్యమి మొదలుకుని నెల రోజుల పాటు ప్రాత:కాల స్నానం, నెల రోజుల పాటు రావి చెట్టుకు నీరు పోసి ప్రదక్షిణలు ఆచరించడం పరిపాటి. శుక్ల పక్ష తృతీయ అక్ష తదియగా సుపరిచితమైనది. ఆరోజే సింహాచలపతికి చందనో త్సవం నిర్వహిస్తారు. విష్ణుపూజ, త్రిలోచన గౌరీ పూజలు తృతీయ నాడే చేయడాన్ని పురుషార్థ చింతా మణి వివరిసున్నది. అక్ష తృతీయ నాడే నూట తొంభై ఆరు వేల మానవ సంవత్సరాల త్రేతాయుగ ప్రారంభ దినమని అమాదేర్ జ్యోతిష గ్రంథం తెలుపు తున్నది. గంగానది జహ్నుముని చెవినుండి సప్తమి నాడు పుట్టినట్లు చతుర్వర్గ చింతామణి కథనం. శుద్ధ ఏకాదశి మోహిన్యేకాదశిగా, బహుళ ఏకాదశి ఆపర ఏకాదశి గా చెప్ప బడింది. బహుళ చతుర్దశి శివపూజ, సావిత్రీ వ్రతాచారణ గావిస్తారు. ఈ మాసంలోనే నరసింహ నవరా త్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే అక్ష తృతీయ నాడు ఆంధ్ర కర్షకులు తాటి చెట్టును కేతనంపై నిలుపుకుని, ప్రధాన సాధనమైన నాగలిని ఆయుధంగా కలిగినన బలరాముని జయంతి రోజున తమ పొలాలలో, గృహస్థులు తమ ఇళ్ళలోని పెరళ్ళలో కూర పాదులు పాతడాన్ని ఆచరిస్తారు. అవి యథా కాలాన మెలకెత్తి, భరణి, కృతిక కార్తెలలో ఎండలను తట్టుకుంటూ నెమ్మదిగా ఎదుగుతూ ముంగిళ్ళు చల్ల బడడంతో ఏపుగా ఎదిగి ఆకర్షణీయంగా కాస్తాయి. కార్తీక మాఘమాసాల తర్వాత అంతటి మహత్యాన్ని కలిగి ఉన్న పుణ్యప్రద మాసం వైశాఖం. పూర్ణిమ తిథినాడు విశాఖ నక్షత్రం ఉండడం వల్ల ఈ మాసానికి వైశాఖ మాసం అనే పేరు ఏర్పడింది. ఆద్యాత్మికత, పవిత్రత, దైవశక్తి ఉన్న నెలల్లో వైశాఖ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వసంత ఋతువులో రెండవ మాసం వైశాఖ మాసం. 'మాధవ' మాసమని పిలువబడే వైశాఖ మాసం లక్ష్మీ నారాయణుల ఆరాధనకు చాలా ప్రసిద్ధమైనది. శ్రీ కృష్ణుడు అక్షయ తృతీయ ప్రాముఖ్యత గురించి ధర్మరాజుకు జ్ఞానోదయం చేసినట్లు పౌరాణికులు చెపుతారు.

వైశాఖంలో రకరకాల వ్రతాలు ఆచరిస్తారు. వైశాఖ మాసంలో సూర్యుడు మేష సంక్రమణంలో ఉండగా ప్రాత: స్నానం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. వైశాఖ మాసం దాన ధర్మాలకు ఎంతో పుణ్య ప్రదమైన మాసంగా పురాణాలలో చెప్పబడింది. మహా విష్ణువు కు ప్రీతి కరమైన ఈ వైశాఖ మాసంలో తులసి దళాలతో శ్రీ మహావిష్ణువు ను లక్ష్మీ దేవితో కలిపి పూజించిన ముక్తి దాయకం. అలాగే శివునకు ఈ మాసమంతా అభిషేకం చేస్తే అది ఆధ్యాత్మిక ఆది భౌతిక ఆదిదైవిక ఇబ్బందులను తొలగించి మనశ్శాంతినిస్తుంది. ఈ మాసం లో ఏక భుక్తం, నక్తం ఉత్తమంగా చెప్పబడింది. వైశాఖ మాసం అందరు దేవతలకు పూజనీయమైనది, యజ్ఞ యాగాదులకు, తపస్సులకు, పూజాదికాలకు, దాన ధర్మాలకు అత్యధిక ఫలమిచ్చి శాంతినిచ్చి కోరికలను తీరుస్తుంది. వైశాఖంలో ఉదకుంభ దానము...నీటితో కూడిన పాత్ర లేదా కుండ దానం చేయడం, దాహం తీర్చగల చలివేంద్రములు ఏర్పాటు చేసి మంచినీరు అందించడం పుణ్యప్రదం.

- రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మేధావి సర్వేపల్లి



## ఏప్రిల్ 17 సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

ఏప్రిల్ 17న మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలు, సేవలను స్మరించుకోవడం ఎంతో అవసరం. సనాతన భారతీయ సంప్రదాయంలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించబడింది. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడే గురువు అనే భావన యుగాలుగా కొనసాగుతోంది. "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" అనే వాక్యాలు గురువుకు ఉన్న గొప్పతనాన్ని స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రుల తర్వాత పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువుదేనని భారతీయ సంస్కృతి విశ్వసిస్తుంది.

రాధాకృష్ణన్ తన పుట్టినరోజును ఘనంగా జరపాలని కోరిన వారికి, "దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరపండి" అని చెప్పడం ఆయన వినయాన్ని, గురుత్వంపై ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుంది. ఆ సూచనతోనే సెప్టెంబర్ 5 భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా స్థిరపడింది. విద్య దేశ అభివృద్ధికి పునాది అని, మంచి ఉపాధ్యాయులే శ్రేష్ఠ సమాజ నిర్మాణానికి కారణమని ఆయన బలంగా నమ్మారు.

1888 సెప్టెంబర్ 5న తమిళనాడులోని తిరుత్తణి గ్రామంలో జన్మించిన రాధాకృష్ణన్ సాధారణ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. బాల్యంలోనే పేదరికాన్ని అనుభవించిన ఆయనకు చదువుకోవడం సులభం కాలేదు. పుస్తకాలు కొనలేని పరిస్థితుల్లో ఇతరుల వద్ద నుంచి తీసుకుని చదివి తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. అలాంటి కష్టసాధ్య పరిస్థితుల్లో కూడా ఆయన అసాధారణ ప్రతిభను ప్రదర్శించి, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు.

ప్రాథమిక విద్య అనంతరం తిరుపతి, నెల్లూరులో చదివి, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో ఎంఏ పూర్తి చేశారు. తత్వశాస్త్రంపై ఆసక్తితో 'ది ఎథిక్స్ ఆఫ్ వేదాంత' అనే అంశంపై థీసిస్ సమర్పించి తన మేధస్సును నిరూపించారు. కేవలం 21 ఏళ్ల వయసులోనే మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో లెక్చరర్గా నియమితులయ్యారు. అనంతరం మైసూరు విశ్వవిద్యాలయం, కలకత్తా విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా సేవలందించారు.

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన రాధాకృష్ణన్ వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకుడిగా నిలిచారు. క్లిష్టమైన తత్వశాస్త్ర విషయాలను సైతం సులభంగా అర్థమయ్యేలా బోధించగలిగిన సామర్థ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. బోధించడం ద్వారా తన జ్ఞానం కూడా పెరుగుతుందని నమ్మిన ఆయన, విద్యార్థులతో అనుబంధాన్ని ఎంతో ప్రేమతో కొనసాగించారు.

ఆయన జీవితంలో గురువుల ప్రాముఖ్యతను తెలియజేసే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చిన్ననాట ఒకసారి పరీక్ష ఫీజు చెల్లించలేకపోయిన సమయంలో, ఆయన ప్రతిభను గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు స్వయంగా ఫీజు చెల్లించడం ఆయన జీవితంలో మర్చిపోలేని సంఘటనగా నిలిచింది. ఈ అనుభవం ఆయనను గొప్ప ఉపాధ్యాయుడిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించింది.

మైసూరు నుంచి కలకత్తాకు వెళ్లే సమయంలో ఆయనను గౌరవిస్తూ విద్యార్థులు గుర్రపు బండిని పూలతో అలంకరించి స్వయంగా లాక్కొని రైల్వే స్టేషన్ వరకు తీసుకెళ్లిన ఘటన, ఆయనపై విద్యార్థులకు ఉన్న ప్రేమను ప్రతిబింబిస్తుంది. ఉపాధ్యాయుడిగా ఆయన చూపిన ప్రేమ, శ్రద్ధకు ఇది నిదర్శనం.

రాధాకృష్ణన్ కేవలం ఉపాధ్యాయుడిగానే కాకుండా, ఉపకులపతిగా, ప్రముఖ తత్వవేత్తగా, దౌత్యవేత్తగా కూడా సేవలందించారు. స్వాతంత్ర భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, అనంతరం రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించి దేశానికి గొప్ప సేవలు చేశారు. విద్య, తత్వశాస్త్రం, రాజకీయం వంటి విభిన్న రంగాల్లో ఆయన కీర్తి వ్యాప్తి చెందింది.

1975 ఏప్రిల్ 17న ఆయన పరమపదించారు. అయినప్పటికీ ఆయన ఆలోచనలు, ఆదర్శాలు నేటికీ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా సమాజాన్ని మార్చగలడని ఆయన జీవితం చెబుతోంది. అందుకే ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం అవసరం.



* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS) 9000674747

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 17.04.2026
www.mudranews.in | @mudranews





**వడదెబ్బ :** శరీరాన్ని చల్లబరచాలి. చల్లటి నీటితో తుడవడం, నీళ్లు గుమ్మరించడం వల్ల శరీర వేడి త్వరగా తగ్గుతుంది.

# విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు తగిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గురువారం కల్వకుర్తి పట్టణంలోని జేపీ నగర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్ వసతులపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. పాఠశాలలో నిల్వ ఉంచిన బియ్యం, గుడ్లు, కూరగాయలు వంటి ఆహార సరుకులను పరిశీలించారు. తరగతి గదులు, పరిశుభ్రత పరిస్థితులు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, బోధన విధానంపై కూడా ఆరా తీశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు.తనిఖీ అనంతరం కలెక్టర్ భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, రుచి, పరిమాణం వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. భోజనం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇదే నాణ్యతను కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు



సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల నిర్వహణపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

**మోడల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన**

వంగూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ (మోడల్) స్కూల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, బాత్రూములు, ఆట స్థలం వంటి అన్ని ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాఠశాల భవనం నిర్మాణం వేగంగా కొనసాగుతున్నప్పటికీ, పనుల్లో నాణ్యతకు ఎలాంటి లోపం రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఏర్పాటు చేయాలని, పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. పాఠశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం లభిస్తుందని, ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**'ఐ క్యాంప్' నిర్వహణ**

ఏరైవ్ ఏలైవ్ కార్యక్రమంలో భాగంగా 'ఐ క్యాంప్'కు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల కంటి చూపు సమస్య ఒక కారణంగా ఉండొచ్చని తెలిపారు. అందువల్ల డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం, భద్రతపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో సగటున ప్రతి నాలుగు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా యువతే బలవుతున్నారన్నారు. రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్ రావు, ఆర్ఐ జగన్, ఎస్సై గోవర్ధన్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్, ప్రశాంత్, ఆర్టీఓ అధికారులు రమేష్ రెడ్డి, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## విగ్రహాల తొలగింపుపై ఆందోళన, ఉద్రిక్తత



**ముద్ర, కాప్రా:** చర్లపల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి తొలగించిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం ఉదయం ఈ విషయం వెలుగులోకి రావడంతో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు చర్లపల్లి బస్టాండ్ వద్దకు భారీగా చేరుకుని నిరసన చేపట్టారు. సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు, దళిత సంఘాలు పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డితో పాటు సుమారు 20 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ విగ్రహాలను ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు. అరెస్టు అయిన వారిలో నేమురి మహేష్ గౌడ్, దప్పు గిరిబాబు, కొమ్ము నర్సింగ్ రావు, కడియాల సురేష్ తదితరులు ఉన్నారు. అనంతరం హెచ్‌బి కాలనీ మాజీ కార్పొరేటర్ జర్రిపోతుల ప్రభుదాస్ పోలీస్ స్టేషన్‌లో వారిని పరామర్శించారు.

## సంక్షిప్తంగా..

### దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభం




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాల్ లోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దోస్త్ ద్వారా ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందదలచిన విద్యార్థులకు ఈ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా పూర్తిగా ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపా రు. దోస్త్ కోఆర్డినేటర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేసి ఉండాలని, అలాగే 10వ తరగతి మెమోలోని పేరు, ఆధార్ కార్డులోని పేరు మధ్య ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు.దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌కు సంబంధించిన వివరాల కోసం దోస్త్ కో ఆర్డినేటర్ పి. సురేష్ బాబు ను 9052 250692 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కడ్తాల మండలం ఎం.బి.ఏ గార్డెన్స్‌లో ఆమనగల్ పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రగతి ప్రణాళికకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం కడ్తాల మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అలాగే రావిచేడు ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మండల స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఎంఆర్ఓ, మున్సిపల్ చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు అధికారులు పాల్గొన్నారు.

### గ్యాస్ ప్రమాదాల నివారణకై అవగాహన

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని సాయిపూర్లో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గ్యాస్ ప్రమాదాలు నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇందుర్ రాములు, బీజేవైఎం నాయకులు తాండ్ర నరేష్ పాల్గొన్నారు.

## అన్యాయం జరిగితే డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తాం

**తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్:** డీలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే వ్యతిరేకిస్తూ, పోరాటం చేస్తామని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మీడియా తో "చిట్ చాట్" నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దొంగదారిన తిరిగి అధికారంలోకి రావడానికే డీలిమిటేషను 2011 జనాభా లెక్కల ప్రకారం చేపట్టడం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆయన తెలిపారు. అందరి



సంక్షేమం కోసం ఆమోదయోగ్యమైన మహిళ బిల్లుకు వంద శాతం మద్దతు ఇస్తాం, కానీ అశాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న డీలిమిటేషన్ ని వ్యతిరేకిస్తాం అని తెలిపారు. తెలంగాణ దేశానికి (కేంద్రానికి) రూ.5 ఇస్తే, తిరిగి తెలంగాణకు రూ.2 మాత్రమే ఇస్తుంది. తాగునీటి సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం కోసం కాగ్నా నుండి నీటి సరఫరా కు, అన్ని వార్డుల్లో బోర్లు వేసి తాగునీరు అందించడానికి తాండూరు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కౌన్సిల్ లో అన్ని అంశాలపై అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, నీటి సరఫరాపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుగుతుంది. తాండూరు సమస్యలపై త్వరగా స్పందించి, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి తాండూరు ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్**

**ముద్ర, కూకట్‌పల్లి:** జిల్లా పార్టీ నియామకాల్లో కూకట్పల్లి నియోజకవరానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. గురువారం కూకట్పల్లి పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నూతన



కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు పొందిన వారు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 18న ఎన్ఎస్‌యూఐ చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం

**ఎర్రవల్లి మండల స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ప్రసంగించారు. హెచ్ పివి వ్యాక్సిన్ తో సర్వైకల్ క్యాన్సర్ ను నివారించవచ్చని 14 ఏళ్ల అమ్మాయిల అందరికీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు రాని వారికి తర్వాత విడతలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం



ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా చిన్నారులు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నందున వినియోగించుకోవాలన్నారు. సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తుంటే అక్కడి పనితీరు మెరుగుపడుతుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ పంటలు సాగు వేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. రహదారి భద్రతపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వాహనదారులు కూడా నిబంధనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. గర్భిణీలకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. విద్య, వైద్య, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించారు. సమావేశంలో ఎర్రవల్లి మండల ప్రత్యేక అధికారి నుషిత, తహసిలార్ నరేష్, ఎంపీడీవో మహేష్, సర్పంచ్ అనిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

## హిందువులు ఐక్యంగా మెలగాలి

**–ఎర్రగడ్డ బస్తీలో హిందూ సమ్మేళనం**
**– ఆచార్య అభినవ శంకరానంద స్వామి**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ బస్తీలో హిందూ సమ్మేళనం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపనకు వందేళ్లు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య అభినవ శంకరానంద స్వామి మాట్లాడుతూ, హిందూ సమాజం జాగృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో




ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ హిందువుగా జీవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రతి హిందువు తమ పిల్లలు, కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసే విధంగా ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.సమ్మేళనంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త భాస్కరయోగి, ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,21 వార్డు కౌన్సిలర్ శంకర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి పిడికిళ్ల జంగయ్య, పట్టణ కార్యవహ్ వేముల సురేశ్ పాల్గొన్నారు.

## అజాగ్రత్త వల్లనే రోడ్డు ప్రమాదాలు

**ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్**



**ముద్ర, నారాయణపేట:** డ్రైవర్ల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయనీ ఎస్పీ వినీత్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట వారి సౌజన్యంతో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఎస్పి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు బాగుంటేనే వాహనాన్ని కండిషన్ లో నడపగలమని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన పత్రాలు, జాగ్రత్త వస్తువు లు తప్పక వెంట తీసుకురావాలన్నారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీవో రామచంద్రరావు, డి.ఎస్.పి లింగయ్య, డిఎం అండ్ హెచ్ వో జయచంద్ర మోహన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టాడ్, సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, లయన్ రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం



**ముద్ర, నారాయణపేట:** కోస్గి పట్టణంలో అభివృద్ధి పనుల తీరుపై కలెక్టర్ ప్రతీక్ జైన్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి గురువారం క్షేత్రస్థాయి లో పరిశీలించారు. పట్టణంలో నిర్మిస్తున్న సైన్స్ మ్యూజియం పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పక్కనే ఉన్న మున్సిపల్ పార్కును పరిశీలించారు. బస్టాండ్ మలుపు దారి వద్ద జంక్షన్ ఏర్పాటు కోసం అధికారులకు సూచనలు చేశారు. అలాగే డంపింగ్ యార్డ్ కు సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మందకొడిగా సాగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళి కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.305 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో పట్టణంలో అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితినీ అధికారులతో కలెక్టర్ గంటన్నర పాటు చర్చించారు. అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న మిగతా పనులను నిర్ణీత గడువు లోపే పూర్తి చేయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కడ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే కోస్గి పట్టణంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

## నూతన సర్పంచులకు సన్మానం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లాలో బిజినపల్లి, నాగర్‌కర్నూల్, తాడూరు, తిమ్మాజిపేట మండలాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 మందికి పైగా సర్పంచులు పాల్గొన్నారు. బిజినపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు నాగం చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గాడి సురేందర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని సూచించారు. నాగర్‌కర్నూల్‌లో జరిగిన కార్యక్రమంలో క్లాస్మేట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 365 రోజులు – 365 కార్యక్రమాల లక్ష్యంతో ప్రతి గురువారం నాగర్‌కర్నూల్ డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచులు సహకరిస్తే ప్రతి గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. తిమ్మాజిపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ సర్పంచులు జిల్లాలో విద్యా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, జిల్లా అధ్యక్షుడు నాగం చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా ప్రతినిధులు గాడి సూర్యకళ సురేందర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పోల శ్రీనివాసులు, కార్యదర్శి కె.పీ. ప్రసాద్, బిజినపల్లి మండల అధ్యక్షుడు బి. నాగిరెడ్డి, తాడూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసాచారి, ఏపీఓ సత్యం, ఎంఈఓలు, ఎంపీడీవోలు, ఎంఆర్ఓలు పాల్గొన్నారు.

**వడదెబ్బ**

ఐస్ ప్యాక్‌లు ఉపయోగించాలి
చంకలు, మెడ, తొడల దగ్గర ఐస్ పెట్టితే శరీర ఉష్ణోగ్రత వేగంగా తగ్గుతుంది.




# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**- కలెక్టర్ రాహుల్ శర్మ**

**మహదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లిలో ఈ నెల 20న జరగనున్న సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఆయన కాటారం మండలం నస్తూరుపల్లిలో జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజ్ ను పరిశీలిస్తారని తెలిపారు. అక్కడి నుంచి కాళేశ్వరం చేరుకొని పుష్కరాల పనుల పై సమీక్ష చేస్తారన్నారు. అనంతరం కాటారం మండలం నస్తూరుపల్లి బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు నిర్వహించడంతోపాటు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.



నస్తూరుపల్లి బహిరంగ సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభాస్థలి వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డీపీవోను కోరారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అన్ని పనులను పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ కు సూచించారు. హెలి ప్యాడ్, అప్రోచ్ రోడ్డు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ మీటింగ్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్..**

కాళేశ్వరం ఆలయ ఆవరణలో సీఎం పర్యటను ఏర్పాట్లను దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న కాళేశ్వరం ఆలయంలో సీఎం పలు పనులకు భూమిపూజ చేయ నున్నట్లు తెలిపారు. పర్యట నకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఈఓ మహేష్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మ యాంక్ సింగ్, ధార్మిక సలహా దారు గోవిం ద హరి, ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ, ఆలయ చైర్మన్ మోహన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారుల 'ఫోరం'ను విజయవంతం చేయండి

**మహదేవపూర్, ముద్ర:**



హైదరాబాద్ లో ఈ నెల 18 న నిర్వహించనున్న ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర సదస్సుకు మండలంలోని ఉద్యమ కారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్ ఒక ప్రకటనలో కోరారు. మర్రి చెన్నారెడ్డి భవన్ లో జరిగే ఈ సదస్సులో ఉద్యమ కారుల న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం చర్చించనున్నట్లు తెలిపారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే సదస్సుకు పార్టీలకు అతీతంగా మండలంలోని ఉద్యమ కారులు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజల మధ్య విభేదాలు సృష్టించొద్దు

**మహాదేవపూర్, ముద్ర:**



సుందరీకరణ పేరుతో ప్రజల మధ్య విభే దాలు సృష్టించవద్దని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్ ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని అన్నారం మూలమలుపు వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటై మూడేళ్లైనా పట్టించుకోలేదన్నారు. కాని ఎన్నికలు సమీపిస్తున్న వేళ సుందరీకరణ చేస్తామనడం సరి కాదన్నారు. గతంలో కాటారంలో బాబా సాహెబ్ విగ్రహావిష్కరణకు ముందే కొందరు ముసుగును తొలగించి గందరగోళం సృష్టించారని గుర్తు చేశారు. సుందరీకరణ పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహరించడం బాబాసాహెబ్ ఆశయాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

## ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు

**కోరుట్ల, ముద్ర:** కథలాపూర్ మండల కేంద్రంలో గురువారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెవీ వాహనాలు, ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై రవి కిరణ్ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. సింధు, డా. మైస శ్రీధర్ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రమాదాల నివారణకు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని డాక్టర్లు సూచించారు. డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జగిత్యాల సభను విజయ వంతం చేయాలి

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లా కేంద్రంలో ఈ నెల 20న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వీఐపీ పార్కింగ్, లైటింగ్, సౌండ్, స్టేజి తదితర ఏర్పాట్లపై పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత హాజరయ్యే ఈ భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రానుండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



**సభ స్థలాన్ని పరిశీలించిన ఇంచార్జులు..**

జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం లో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని బీఆర్ ఎస్ జగిత్యాల జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ధర్మపురి నియోజకవర్గ ఇంచార్జి, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు గురువారం పరిశీలించారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ , మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

# అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్**

**కోరుట్ల, ముద్ర:** మున్సిపల్ లోని అవినీతి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అఖిలపక్షం అధ్యక్షుడు చెన్న విశ్వనాథం డిమాండ్ చేశారు. పట్టణంలోని గడి బురుజుల స్థలాల్లో నకిలీ దస్తావేజులతో జరిగిన వాకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్టీ) ప్రక్రియతో సుమారు రూ.80 లక్షల వరకు చేతులు మారాయని ఆరోపించారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డా. టి. కే.శ్రీదేవికి ఫిర్యాదు చేసేందుకు గురువారం బల్దియాకు వచ్చారు. కాని అనివార్య కారణాల వల్ల ఆమె పట్టణానికి రాకపోవడంతో ఈమెయిల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ గడి బురుజుల స్థలంలో అనుమానాస్పద పన్నుల విధానం, అక్రమ నిర్మాణాలపై నిరసన వెల్లువెత్తుతున్న తరుణంలో కమిషనర్ వల్ల జరిగిన తప్పిదానికి ఇద్దరు ఉద్యోగస్తులు మహేష్, క్రాంతిలను విధులకు రానివ్వడం లేదని విమర్శలు వస్తున్నట్లు చెప్పారు.



సర్వే నంబర్ లేకుండా కేవలం హౌస్ నంబర్ ఆధారంగా పన్నులు విధించడం సరికాద ని అభిప్రాయపడ్డారు. గడి బురుజుల స్థలాలు జైన చాళుక్యుల నాటి సంపద అన్నారు. అలాంటి భూ మిపై ప్రైవేట్ వ్యక్తుల అజామాయిషీని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గడి స్థలాల్లో జరిగిన అవినీతి బాగోతం పూర్తి వివ రాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. ఆ స్థలాల్లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మైసమ్మ దేవాలయం, కూరగాయల మార్కెట్, పార్కు నిర్మించాలని ఫిర్యాదులో కోరినట్లు వారు తెలిపారు.

# పట్టణాభివృద్ధి కి ప్రతిపక్షాలు సహకరించాలి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి కోరారు. గురువారం వైస్ చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ మున్సిపల్ పాలక వర్గం ఒక వార్డు అభివృద్ధి కంటే పట్టణాభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఉన్న నిధులను వార్డుల అవసరాల ప్రకారం పనులకు కేటాయిస్తామని తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు అవగాహన రహిత పనులు చేయవద్దన్నారు. అన్ని పార్టీల కౌన్సిలర్ల సహకారంతో మున్సిపల్ పాలనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి అడ్డుపడకుండా తమతో కలిసి రావాలని కోరారు. పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమన్నారు. కాగా ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.15 కోట్లతో పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనకు కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత స్పష్టం చేశారు. గురువారం కొడిమ్యాల మండలంలోని పలు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మిల్లర్లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సరఫరాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సమయానికి బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న సరఫరాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ, సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె మిల్లర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. నిర్మల్ పట్టణాభివృద్ధికి మంజూరైన పాత టెండర్లను రద్దు చేసి, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులను నిర్లక్షం చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ కౌన్సిలర్ లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్, డీఈ సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోయినా వైస్ చైర్మన్ సమావేశాన్ని నిర్వహించి టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. మైనార్టీ వార్డుల్లో అధిక నిధులు పెంచి, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో నిధులు తగ్గించడం సరికాదన్నారు. పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విన్నపం మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్మల్ మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, కౌన్సిలర్లు సాదం స్వప్న అరవింద్, గంజి విజయ్ కుమార్ (రాజు), శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, హేమలత ముత్యం, ధర్మాజీగారి రమ్య ఈశ్వర్, విఠల్, అయిండ్ల విజయలక్ష్మి , జింక సురేందర్, ఖమ్మం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోస్త్ ద్వారా కళాశాలలో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని సూచించారు. దోస్త్ మొదటి విడత ప్రక్రియ ఈ నెల15 న ప్రారంభమైందని, ఇది మే 7 వరకు కొనసాగుతోందన్నారు. ఈ లోపు విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధాకర్, అధ్యాపకులు డాక్టర్ గంగాధర్, శ్రీహరి, డాక్టర్ పీజీ రెడ్డి, రమేష్, సుభాష్, అర్చన, రజిత తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ -అలైవ్ పై అవగాహన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "అరైవ్ -అలైవ్" లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, పట్టణ సీఐ సమ్మయ్య మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఓవర్ టేక్ చేయకూడదని తెలిపారు. ప్రతి వాహన దారుడు ఎడమ పక్కనే వాహనం నడపాలని పేర్కొన్నారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం వంటివి తప్పనిసరిగా పాటించాలని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంరక్షణ కోసమే నిబంధనలు అమలు చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు తమ వంతు బాధ్యతగా వార్డుల్లో ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ టౌన్ ఎస్సైఅజయ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కోరుట్ల, ముద్ర;** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత ప్రజలను కోరారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి పంపిన సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. . ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహమ్మద్ షాహిద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

**కోరుట్ల, ముద్ర:** పట్టణంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాదాపూర్ ఎక్స్ రోడ్ వద్ద మోతే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తునికి రాకేష్, ఏ. మధు లను అదుపులోకి తీసుకొని 65 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి వద్ద నుండి గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, స్కూటీని స్వాధీన పరుచుకున్నట్లు చెప్పారు. కోరుట్ల పట్టణానికి చెందిన పూసల వెంకటేష్‌ను గాంజాయి హైదరాబాద్ నుంచి తెచ్చి వీళ్లకు అమ్ముతున్నట్లు తెలిపారు.

వడదెబ్బ : గాలి తగిలేలా చూడాలి

ఫ్యాన్ లేదా గాలి బాగా తగిలేలా చేస్తే చల్లబడే ప్రక్రియ వేగవంతం అవుతుంది.



# సమర్ధవంతంగా సంక్షేమ పథకాల అమలు

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక మండల సభ
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్



**ముద్ర, సూర్యాపేట:**
ప్రజల సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మునగాల మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన మండల సభలో జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలలో ప్రజా సమస్యలపై అందరూ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమం అందరికి చేరడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గ్రామ, మండల వ్యవస్థ బలోపేతం అయ్యి వేగవంతంగా సేవలు అందించాలని తెలిపారు. సమస్య లేని గ్రామాలు ఉండవని, సమస్యను గుర్తించి సత్వరమే సమస్యకు పరిష్కారం ఏ విధంగా జరుగుతుందో ఆలోచన చేసి వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన అందరికి చేరాలని, చాలా మందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన లేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.200కోట్లతో యాంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు. మహాలక్ష్మి , గృహ జ్యోతి రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు ఆజాగ్రత్తగా ఉండడం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. రోడ్డు నియమాల గురించి రోడ్లపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలని హెల్మెట్ వాడడం సిట్ బెల్ట్ ధరించడం గురించి వివరించాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదు అనే విషయం గురించి తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరిస్తామని సీట్ బెల్ట్ పెట్టుకుంటామని మద్యం తాగి వాహనాలు నడపమని తల్లిదండ్రుల నుండి పిల్లలు ప్రామిస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.శిరీష, తహసిల్దార్ సరిత ఎంపీడీవో రమేష్ సర్పంచ్ ప్రమీల ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

# మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
దేశ రాజధాని ఢిల్లీ నగరం చుట్టూత నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్ సి ఆర్) లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని, పనిగంటలు తగ్గించాలని, ఇతర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న పోరాటంపై పరిశ్రమల యాజమాన్యాలు ఆయా రాష్ట్రాల బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




గురువారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా వర్క్ షాప్ అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మల్లికార్జున్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎండి పాషా, తుర్కపల్లి సురేందర్, మాయ కృష్ణ, గొరిగే సోములు, సిలువేరు రామకుమారి, చెక్క రమేష్, సుబ్బారు సత్యనారాయణ, బూరుగు సప్న, పుష్ప, సిహెచ్ శ్రీనివాస్, జన్ని జంగయ్య, చీమకండ్ల శ్రీరాములు, గంధమల్ల మాతయ్య, మంచాల మధు, పోతరాజు జహంగీర్, సయ్యద్ ఉమర్, బండారు శ్రవణ్, వడ్డేపల్లి యాదగిరి, ఎస్కే శ్రీను, అప్పం సురేందర్, పలుగుల మునీశ్వర్ రెడ్డి, జమ్ము రాజశేఖర్, బాల్ద సిద్ధులు, వెంకటేశం పాల్గొన్నారు.

# వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర, ఆలేరు :**
జిల్లాలో ఉన్న చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలోని గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు "ఆరోగ్య భరోసా" కార్యక్రమాన్ని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాలామణి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనలతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు, ల్యాబ్ పరీక్షలు అందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, డిఆర్ డిఏ పిడి నాగి రెడ్డి, శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మునిసిపల్ కౌన్సిలర్లు, పట్టణ చేనేత సంఘం సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ముద్ర, ఖమ్మం:**
ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు.

# ఉపాధికి ఉరి వేస్తున్న మోడీ ప్రభుత్వం

- వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా

**ముద్ర, బీబీనగర్ :**
వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉరి వేస్తూ.. కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా విమర్శించారు. గురువారం బీబీనగర్ మండల పరిధిలోని ముగ్ధంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం వారిని ఉద్దేశించి నర్సింహా మాట్లాడుతూ.. గ్రామీణ పేదల జీవన పరిస్థితుల్లో మార్పు తెచ్చిన ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి కూలీలను రోడ్డుపై పడేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీలో సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.800 ఇవ్వాలని, పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగడానికి నీళ్లు, మెడికల్ కిట్టు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల ఎంపీడీఓ ఆఫీసుల ముందు ఈ నెల 20 నుండి 25 వరకు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్, సిఐటియు మండల కన్వీనర్ బండారి శ్రావణ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహా, కార్మికులు మట్ట పద్మ, వెంకటమ్మ, అంజమ్మ, మానస, సిలివేరు మంజుల , కవిత, గౌరుకంటి అరుణ, క్రిష్ణవేణి, పద్మ, లలిత, గుండు యాదమ్మ పాల్గొన్నారు.





## సీటు బెల్టు బాధ్యతగా ధరించాలి

**ముద్ర, సూర్యాపేట:**
కారులో వెళ్లే ప్రతీ ఒక్కరు బాధ్యతగా సీటు బెల్టు ధరించాలని సూర్యాపేట జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహ సూచించారు. మునగాల మండలం మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కల్పించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కారు ఎక్కగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్న జిల్లా కలక్టర్, ఎస్పి అందరికి ఆదర్శంగా నిలిచారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచనలు చేశారు. సీట్ బెల్ట్ పెట్టుకుంటే అనుకోని ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడవచ్చని సూచించారు.



## జావిద్ కు తుది వీడుకోలు

- డిప్యూటీ సీఎం భట్టి నివాళి
- రాహుల్ గాంధీతో పాటు పలువురు మంత్రుల సంతాపం

**ముద్ర, ఖమ్మం:**
సీనియర్ కాంగ్రెస్ నాయకులు , జననేత మహమ్మద్ జావిద్ కు గురువారం సాయంత్రం వీడ్కోలు పలికారు. బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జాతీయ రహదారి మధ్యలో మృతి చెందిన జావేద్ భౌతిక కాయాన్ని ఖమ్మంలో గల రెడ్ హిల్స్ లోని ఆయన స్వగృహం వద్ద తీసుకుని రాగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి నివాళులర్పించాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అనుచరుగా పేరుగాంచిన జావీద్ మృతదేహాన్ని సందర్శించిన విక్రమార్క నేడు జరిగిన ఆయన అంతిమయాత్రలో పాల్గొని , తుది వీడ్కోలు పలికారు. జిల్లాలోని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు సంభాని చంద్రశేఖర్, పువ్వాడ అజయ్ కుమార్ లతో పాటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం జావిద్ మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు. రెడిల్స్ లోని ఇంటి నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కూడా సాయంత్రం జావిద్ ముతదేహాన్ని కొద్దిసేపు ఉంచిన అనంతరం ఖిల్లా లోపల ఆయన అంతిమ సంస్కారాన్ని నిర్వహించారు.



## సెల్ ఫోన్ అప్పగింత..

**ముద్ర, యాదగిరిగుట్ట :**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చిన హైదరాబాద్ కు చెందిన మహేష్ దర్శనం వెళ్లే సమయంలో కొండపైన బస్ స్టాప్ లో తన మొబైల్ ఫోను మర్చిపోయాడు. కొండపైన బస్ స్టాప్ లో అక్కడే విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది శేఖర్ ఆ మొబైల్ ఫోను గమనించి మైక్ లో అనౌన్స్ చేపించి భక్తుని వివరాలు తెలుసుకొని భక్తునికి అప్పజెప్పాడు. భక్తునికి తన మొబైల్ ఫోను తిరిగి ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశాడు. అనంతరం శేఖర్ ను ఆలయ అధికారులు ఎస్పిఎఫ్ అధికారులు తోటి సిబ్బంది భక్తులు పలువురు అభినందించారు.



## జావీద్ కు పలు సంఘాల నాయకుల నివాళి



**ముద్ర, ఖమ్మం:**
రోడ్డు ప్రమాదంలో మృతి చెందినసీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జావిద్ భౌతిక కయాన్ని సందర్శించిన పలు సంఘాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం రెడ్ హిల్స్ ప్రాంతం లో జావిద్ ఇంటి ఆవరణలో ప్రజల సందర్శనార్థం మహమ్మద్ జావిద్ భౌతిక కాయాన్ని ఉంచారు. వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. జ్యోతి , గౌరవ సలహాదారులు పుష్ప రజక , జేఏసీ కన్వీనర్ బానోతు బద్రు నాయక్ ,వీరన్న నాయక్, ప్రకాష్ ,యాదవ్ , శివలాల్ తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం , సానుభూతి ప్రకటించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వడదెబ్బ : వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి**

ఇది ప్రాణాపాయం కావచ్చు. కాబట్టి ఆలస్యం చేయకుండా డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి.





## మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి సత్కారం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన కే. శ్రీనివాస్ రెడ్డికి మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే బృందం సత్కారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఫైర్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఫైర్ సర్వీస్ వీక్-2026లో భాగంగా మెదక్ ఫైర్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, న్యాయవాదులు, జైలు శాఖ సిబ్బంది కలిపి 15 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఫైర్ ఆఫీసర్ జి. వేణు ప్రారంభించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. వెంకటేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా మెదక్ పట్టణంలోని నివాస భవనాల్లో అగ్ని భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎల్‌పీజీ గ్యాస్ భద్రత, ఎలక్ట్రికల్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

ఈనెల 18న శనివారం సిద్దిపేట జిల్లా 0కేంద్రంలోని కార్మిక కర్షక భవన్‌లో జరగనున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. గురువారం జిల్లా మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆముదాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం అనేక ఇబ్బందుల్లో ఉందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను ప్రభుత్వాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో సరిపడ నిధులు కేటాయించకపోవడం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీలను ఎత్తివేయడం జరిగిందన్నారు. యూరియా కొరత, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుమందులను ప్రభుత్వాలు నియంత్రించకపోవడం, పత్తి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్లలో అనేక ఆంక్షలు విధించడం దారుణమన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు ప్రభుత్వాలు చాపకింద నీరులా క్రమక్రమంగా వ్యవసాయ రంగాన్ని నష్టాల ఊబిలోకి నెట్టే విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతాంగానికి మద్దతుగా జరగనున్న సిద్దిపేట జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని, రైతు సోదరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతిరెడ్డి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, ఆముదాల నర్సిరెడ్డి, తుప్పర్తి రాజు, కనుకచారి, కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి రూ.3.17 కోట్లు మంజూరు

- **మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు రూ.3,17,80,979 నిధులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మంజూరు చేయించారని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం. గంగాధర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలనే సంకల్పంతో ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, ఇతర సదుపాయాల కోసం నిధులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం అందించడంలో మాట నిలబెట్టుకుంటున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు గంట సంపత్, శశాంక్, నాయకులు భూపతిరాజ్, సమీయొద్దీన్, అవారి చంద్రశేఖర్, ఓమర్, సిద్దరాములు, సుమన్, దయసాగర్, బాలరాజు గౌడ్, ఇస్సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి రూ.1000 కోట్లు ఖర్చు

- **కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజలు, రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆరు గ్యారంటీల అమలు కింద రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మండల స్థాయి సభలు నిర్వహించారు. అందులో భాగంగా కొమరవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన మండల స్థాయి సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజులపాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 2న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని చెప్పారు. అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభలు కొనసాగుతున్నాయని, మే నెలలో నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి వారం ఒక శాఖ థీమ్‌ను తీసుకుని జూన్ 11 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి వారంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామని, అనంతరం హెల్త్ వీక్ నిర్వహించామని, ప్రస్తుతం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ, రైతు సంక్షేమం, విద్య, క్రీడలు, యువజన, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్దిష్ట ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం, సేంద్రియ వ్యవసాయం పాటించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూమి సారాన్ని పెంపొందించాలని సూచించారు. జిల్లాలో 25 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, పాత కార్డుల్లో 37 వేల మంది సభ్యులను చేర్చినట్లు తెలిపారు. ప్రతినెల 6,580 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 11,241 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, 9,954 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి చేసి రూ.204 కోట్ల బిల్లులు చెల్లించామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి మరో 3,500 ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్యాస్ సబ్సిడీ కింద రూ.22.83 కోట్లు అందించగా, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు రూ.152 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రైతు భరోసా కింద 3,11,000 మంది రైతుల ఖాతాల్లో రూ.392 కోట్లు జమ చేశామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.330 కోట్లు చెల్లించామని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మర్కుక్ మండలంలో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, కొండపాకలో రూ.200 కోట్లతో 16 ఎకరాల్లో కొత్త పాఠశాల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చర్యలు కొనసాగుతున్నాయని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం అమలు చేయనున్నట్లు, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కాలేజీల్లో ఉచిత మధ్యాహ్న భోజనం, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పోలీసులు రహదారి భద్రతపై, మహిళా శిశు సంక్షేమ శాఖ పౌష్టికాహారం పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరాలి

- **కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడం మండల సభల ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు కృషి చేయాలని పునరుద్ఘాటించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు. గ్రామ స్థాయిలో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసాచారి, ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం, సర్పంచ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించొద్దు**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణంలో నిర్వహించిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా రవాణా అధికారి వెంకట స్వామి, డీఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు బంధు నిలిపివేతపై హైకోర్టు ఆగ్రహం

- **తక్షణమే నిధుల విడుదల, ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

రైతులకు రావాల్సిన రైతు బంధు ప్రయోజనాలను నిలిపివేయడంపై రాష్ట్ర హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని శంకాపురం గ్రామానికి చెందిన పిటిషనర్ల భూములకు సంబంధించి రైతు బంధు మొత్తాలు నిలిపివేయడం, పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం చట్టవిరుద్ధమని ప్రాథమికంగా గుర్తించిన న్యాయస్థానం, కలెక్టర్ సహా సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పిటిషనర్ల భూములు 8 ఎకరాలు 32 గుంటలు ఉండగా, సివిల్ కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఇంజంక్షన్ ఆర్డర్‌ను ఆధారంగా తీసుకొని అధికారులు రైతు బంధు ప్రయోజనాలను నిలిపివేశారు. అయితే ఆ ఇంజంక్షన్ కేవలం భూమిని విక్రయించకూడదు లేదా బదిలీ చేయకూడదనే పరిమితి మాత్రమే విధించిందని, రైతు సంక్షేమ పథకాలను నిలిపివేయడానికి అది కారణం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులుగా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసీల్దార్‌లను పిటిషనర్లకు రావాల్సిన రైతు బంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు, కేసును తదుపరి విచారణకు జూన్ 16కు వాయిదా వేసింది.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

**ముద్ర న్యూస్ :**

నవీపేట మండలం జన్నేపల్లిలో గురువారం ఓ మహిళ విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై శ్రీకాంత్, గ్రామస్థుల కథనం ప్రకారం.. దుబ్బా కాలనీకి చెందిన పెంట లక్ష్మి (46) ఇంటి బయట ఉన్న బోరు మోటారుపంపును ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయారు. స్థానిక కాలనీలో కొన్ని రోజులుగా ఎర్తింగ్ సమస్య ఉన్నా. అధికారులు పట్టించుకోలేదని, లక్ష్మి మృతికి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపించారు. స్థానిక విద్యుత్తు ఉప కేంద్రానికి కుటుంబీకులు, బంధువులు మృతదేహంతో తరలివచ్చి ఆందోళన చేపట్టారు. అనంతరం ఎస్సై ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది. సదరు కాలనీలో ఎర్తింగ్ సమస్యపై ఇది వరకే సిబ్బంది పరిశీలించారని అలాంటిది ఏమీ లేదని తేలిందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందులో సిబ్బంది నిర్లక్ష్యం లేదని ఆయన వివరించారు. లక్ష్మి భర్త నారాయణ 8 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారని.. ఆమెకు కుమారుడు కుమార్తె ఉన్నట్లు గ్రామస్థులు చెప్పారు. కుమారుడు శివసాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

**ముద్ర, నిజామాబాద్ :**



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్నిప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాఅమలు చేస్తోందని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. గురువారం జిల్లాలోని సిరికొండ మండల కేంద్రం ఏర్పాటు చేసిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకు గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. తొలివిడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరాయని, త్వరలోనే ప్రభుత్వం రెండో విడత కింద లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేయనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దు అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మండల ప్రత్యేక అధికారి నాగూరావు, ఎంపీడీఓ మనోహర్, తహసీల్దార్ రవీందర్ రావు పాల్గొన్నారు.

## నూతన ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

**ముద్ర నూస్ :**

నాగిరెడ్డిపేటలో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి బీఆర్ఎస్ మండల పార్టీ నాయకుడు సాయిబాబా గురువారం విరాళాన్ని అందజేశారు. మండలంలోని జలాల్పూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఈ ఆలయానికి తన వంతు సహకారంగా కన్నారెడ్డి గ్రామానికి చెందిన గుత్తేదారు, బీఆర్ఎస్ నాయకుడు పేరుపల్లి సాయిబాబా రూ.25 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ నగదును ఆలయాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. ఆయన వెంట కన్నారెడ్డి గ్రామ సర్పంచ్ సాయిలు, మాజీ సర్పంచ్ ధారబోయిన కృష్ణ, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
17.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వడదెబ్బ : కొన్ని మందులు ఇవ్వకూడదు**

ప్యారాసిటమాల్, ఐబూప్రొఫెన్ లాంటి మందులు ఇవ్వకూడదు. ఇవి పరిస్థితిని మరింత కష్టతరం చేయవచ్చు.



# రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

- జీవో 252 లో అవసరమైన మేరకు సవరణలు చేస్తాం
- జర్నలిజంతో సంబంధం లేనివారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండ చూడాలి
- ఎలైట్ పీపుల్ నుంచి జర్నలిస్టులను తొలగించాలి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**



రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల అభ్యర్థన మేరకు 252 జీవోలో, అవసరమైన మేరకు సవరణలు చేసి డిపిఆర్ఓలకు పంపిస్తామని చెప్పారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ లో టియుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి
కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చేర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు జారీ చేసే అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని అన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని ఆ కమిటీ నివేదిక మేరకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పెద్ద పత్రికల జర్నలిస్టులేవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తారని అన్నారు. జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా యూనియన్ బాధ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులకు కార్డులు అందకుండా అడ్డుకోవాలని అన్నారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐఏఎస్, ఐపిఎస్ లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చడం అభ్యంతర కరమైందన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సంఘం సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లాలని, సంఘం బలోపేతం కోసం పాటుపడాలని, సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, పనిచేయడం ముఖ్యమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందే విధంగా పాటుపడాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహా సభలను మే 15లోగా నిర్వహించాలని మరికొన్ని జిల్లాల సభలను జూన్ 15 లోపు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. అంతకుముందు మూడు మాసాల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలవల్ల మరణించిన 16 మంది జర్నలిస్టులకు నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ తన నివేదికను సమర్పించారు. ఐజేయు జాతీయ ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు 11వ ప్లీనరీn యూనియన్ నిబంధనావళికి సవరణలు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడా వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ఐజేయు ప్లీనరీలో చేసిన తీర్మానం మేరకు హైదరాబాద్ లో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సును ఏర్పాటు చేయాలని, జాతీయ న్యూస్ పేపర్స్ కన్ఫడరేషన్ జాతీయ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించాలని తీర్మానించారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులపై నిజానిర్ధారణ చేసేందుకు గాను, సీనియర్ పాత్రికేయులతో త్రిసభ్య కమిటీని నియమించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశ నిర్వహణకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆతిథ్యాన్ని ఇచ్చింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గంతో పాటు 29 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఇంకా ఈ సమావేశంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ మాజీద్, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, కే సత్యనారాయణ, అజిత, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే. రాములు, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, గుండ్రాతి మధు గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, మేడ్చల్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు జి.బాల్ రాజ్ గౌడ్, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ఎవరూ ఆందోళన చెందవద్దు

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకుంటామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పి. విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్‌కుమార్ హాజరై జిల్లాకు సంబంధించిన ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీకి వినతిపత్రాలు సమర్పించి, సభా వేదికపై నుంచే సమస్యలను వివరించారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అక్రిడేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో రంగారెడ్డి జిల్లా చూపిస్తున్న సమస్యను ప్రస్తావించగా, ఇది సాంకేతిక లోపమని గుర్తించిన నాయకులు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నల్లమల్ల ప్రాంతంలోని మన్ననూరు, బ్రహ్మగిరి కేంద్రాల్లో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు కూడా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత కమిషనర్‌తో చర్చించి త్వరితగతిన పరిష్కారం కల్పిస్తామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఎవరూ ఆందోళన చెందవద్దని, సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయని జిల్లా అధ్యక్షుడు పి. విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్ తెలిపారు.






## క్రీడల్లో వీఎం హోమ్ విద్యార్థుల రాణింపు అభినందనీయం

- రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

విద్యతో పాటుగా క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మంత్రి సరూర్ నగర్ లోని వీ.ఎం. హోమ్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి క్రీడా ప్రాంగణంలో క్రికెట్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన వీఎం హోమ్ పాఠశాలలోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. క్రీడా రంగంలో మంచి ఫలితాలను సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపును పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యాపరంగా ఉపాధ్యాయుల పనితీరును, వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని సందర్శించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మంత్రి సంహపంక్తి భోజనం చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బందికి సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించగా సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వి.ఏం.హోమ్ పాఠశాల కార్యదర్శి/డిడి సోషల్ వెల్ఫేర్ జే రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ సి నరసింహారెడ్డి, పాఠశాల సూపరింటడెంట్ లక్ష్మీపార్వతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


## ఆస్పత్రుల్లో 134 వైద్యసేవలు

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:**

134 వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రుల మాతా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రతి గర్భిణీకి ఎంసీహెచ్ ఫొటోల్లో నమోదు చేసి వారిని ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం సంబంధించిన రోగులకు సరైన మందులు, ఫాలోఅప్ నిర్వహించాలని ఆదేశించారు. కొండాపూర్లో నిర్మాణంలో ఉన్న గ్రామ కేర్ సెంటర్ ను పరిశీలించారు. జిల్లాలోని 30శాతం ఆసుపత్రులు జాతీయ నాణ్యతా ప్రమాణాల ఆమోదం పొందాలని ఆకాంక్షించారు. డీఎంహెచ్వో లలితాదేవి, కొండాపూర్ డీసీహెచ్ఎస్ డాక్టర్ అనురాగిణి, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ చంద్రకృష్ణ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.








# సీజ్ బోర్డు సాక్షిగా.. టులెట్ దర్జా!

## పరదాల మాటున అక్రమ నిర్మాణాలు

- సీజ్ చేసిన భవనానికే టు – లెట్ బోర్డు
- ఇజ్జత్ నగర్ లో యధేచ్ఛగా 'ముఠా' అక్రమాలు
- మాదాపూర్ లో మున్సిపల్ అధికారుల 'మాయ'

**ముద్ర, శేరిలింగంపల్లి:**

సిగ్గు.. సిగ్గు. అధికారులు ఒకటి చేస్తే.. ఆక్రమణ దారులు మరొకటి. అధికారులు నోటీసు బోర్డు అంటిస్తే.. దాని కిందే టులెట్ బోర్డు. పనులు ఆపేస్తే మరుసటి రోజే పనులు కొనసాగింపు. ఇలా మూడు నెలల కాలంలో భవనమే పూర్తి చేసిన ఆక్రమణ దారులు దర్జాగా అద్దె బోర్డు తగిలించారు. ఇది ఎక్కడో కాదు స్వయాన మాదాపూర్ సీఎంసీ కార్యాలయం సమీపం లోనే. దీని మర్మమేమి చెప్పండి మున్సిపల్ అధికారులారా? గత మూడు నెలల క్రితమే ఆక్రమణలు గుర్తించి స్థానికులు ఫిర్యాదు చేస్తే, అధికారులు నోటీసు ఇచ్చినా ఆక్రమణ దారులు స్పందించరు. రెండో నోటీసుకూ ఉలుకూ పలుకూ ఉండదు. ఈ లోగా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉంటాయి. కొంచెం చొరవ, ధైర్యం చేసి అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తూ బోర్డు తగిలిస్తే, మరుసటి రోజు నుంచే పనులు కొనసాగింపు. పనులు కొనసాగుతున్న విషయాన్ని ఫిర్యాదుదారుల ద్వారా తెలుసుకున్న మున్సిపల్ అధికారులు పనిముట్లను స్వాధీన పరుచుకున్నా పనులు ఆగవు. కొసమెరుపు ఏంటంటే ఆకుపచ్చ పరదా పైన మున్సిపల్ అధికారుల సీజ్ బోర్డు తగిలిస్తే లోపల పనులు మాత్రం యథావిధిగా కొనసాగడం. బయటికి మాత్రం సీజ్, మూడు నెలల తరువాత ఇలా టు లెట్ బోర్డు. ఇది అధికారుల నాటకమా.. ఆక్రమణదారుల ఆటలా...

ఎక్కడో కాదు సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో హైదరాబాద్ లోనే అత్యంత ఖరీదైన అద్దె ప్రాంతం ఐటి ఏరియా మాదాపూర్ ఇజ్జత్ నగర్.


**సీఎంసీకి ఫిర్యాదు...**

గతంలో ఇవే అక్రమణ నిర్మాణాలపై 'హైటెక్ సిటీలో హైటెక్ ఆక్రమణ, అసలు వదిలి కొసరుపై కొరడా, ఎట్టకేలకు ఏడంతస్థుల భవనం సీజ్' అనే ప్రధాన శీర్శికలతో 'ముద్ర' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించింది. సీజ్ బోర్డు ఉండగానే టు – లెట్ బోర్డు ఉదంతంపై స్థానికులు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇక మున్సిపల్ అధికారులు భవనాన్ని అద్దెకిస్తారో, కూల్చివేస్తారో వేచి చూడాలి మరి.

**నాలుగు నెలలుగా కొనసాగుతున్న తతంగం**

గత నాలుగు నెలలుగా 'ముద్ర' ఈ అక్రమ నిర్మాణాలపై వరుస కథనాలు ప్రచురించింది. మాదాపూర్ ఇజ్జత్ నగర్ లో సర్వే నెంబర్ 214/2/1/2 లో గంగాల శంకర్ యాదవ్ అనే వ్యక్తి ప్రభుత్వ రేషన్ దుకాణ స్థలాన్ని ఆక్రమించుకుని మూడంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నాడన్న స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు 2026 ఫిబ్రవరి 16 న సీజ్ ఆర్డర్స్ జారీ చేసి అసంపూర్తిగా ఉన్న భవనానికి సీజ్ బోర్డు తగిలించారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్న ఆలోచనతో ఉమాకాంత్ రెడ్డి అనే వ్యక్తి జనవరి 8న మొదటి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదుల పర్వం కొనసాగడంతో మార్చి 16న సీజ్ ఆర్డర్స్ ఇచ్చినప్పటికీ భవన నిర్మాణం కాస్తా పూర్తైంది. అక్రమ నిర్మాణంలో ఉన్న భవనం స్కల్టన్ చుట్టూ ఆకుపచ్చ పరదా ఉండగా ముందు భాగంలో మున్సిపల్ అధికారులు సీజ్ అని ఉన్న ఫ్లెక్సీని అంటించారు. ఆ సీజ్ బోర్డు అలానే కన్పిస్తుంది, కానీ లోపల పనులు కొనసాగినట్లు భవనం పూర్తయ్యింది. పనులు జరుగుతున్నాయన్న విషయాన్ని అధికారుల నోటీసుకు తీసుకెళ్లగా ఒకరిద్దరు సానిటేషన్ సిబ్బందిని పంపించి సామాన్లు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు బాగానే స్పందిస్తున్నారనుకుంటే పొరబడినట్టే, ఆ మరుసటి రోజే మళ్లీ పనులు మొదలవుతాయి. సీన్ కట్ చేస్తే డిసెంబర్ 2025 నుంచి 2026 ఏప్రిల్ వరకు పరదాల చాటున పనులు పూర్తయ్యాయి. మున్సిపల్ అధికారులు సీజ్ చేశామంటూ తగిలించిన బోర్డు కిందే అద్దెకు ఇవ్వబడును అంటూ, యాజమాని టు - లెట్ బోర్డు పెట్టడం కొసమెరుపే కదా.. లొకేషన్ ఉంటే పంపండి పరిశీలిస్తాం.

మాదాపూర్ ఇజ్జత్ నగర్ లో సీజ్ చేసిన అక్రమ నిర్మాణానికి టులెట్ బోర్డు తగిలించడమేంటని మాదాపూర్ మున్సిపల్ డీసీపీని ప్రశ్నిద్దామని ఫోన్ చేస్తే స్పందించరు. ఇక స్పందించిన ఏసీపీ సురేందర్ రెడ్డి లోకేషన్ ఉంటే పంపండి పరిశీలిస్తాం అంటూ సమాధానం ఇచ్చారు. సీజ్ చేసిన అధికారికే అడ్రస్ అడగటమంటే పని ఒత్తిడా లేక, పైసల వత్తిడా ఉన్నాతాధికారులే తేల్చాలి మరి.



To
The Zonal Commissioner (ZC), Madhapur Zone
CMC, HiTEX, Hi-Tech City, Hyderabad – 500084

HYDERABAD
15-04-2026

Copy to: **The Commissioner, CMC** | Chief City Planner, CMC , Hyd-84.

**Subject:** Non-Implementation of SEIZE Orders by DC, Madhapur — Request Immediate Intervention & **Demolition of Illegal** G+3 Building at Izzathnagar, HiTEX, HiTech City, Kondapur, HYD-84.

Ref: 1. Complaint to DC, Serilingampally dated 15-04-2026
2. SEIZE/SEAL Order dated 16-02-2026
3. GHMC Notice: 08-01-2026
4. 60+ complaints since Nov 2025 |
5. My latest GHMC complaint ID: 150426 5821 592 dtd 15-4-2026

Office Of The Commissioner Cyberabad Municipal Corporation ★ Dt: 16/04/26 Sig:

Respected Sir,

I am compelled to escalate this matter to your office as the Deputy Commissioner, Madhapur, Mr. Balakrishna garu appears unable to enforce SEIZE orders and take decisive action against a flagrant violation.

The Issue:
An illegal G+3 building at Sy. No. 2-14/2/1/2, **Mr.Gangala Sankar Yadav** House, Izzathnagar Village, Ration Shop area, Kondapur was ordered to be SEIZED/SEALED on 16-02-2026 after my complaint at **CMC Prajavani.**

Despite SEIZE orders, the violators covered the site with green sheets and completed all 3 floors between 16-02-2026 and 15-04-2026. The building is now being advertised for rent. **This is happening directly opposite the CMC Office, NAC Building, Hi-Tech City Road.**

DC Office Limitations Observed:
1. Notice issued on 08-01-2026 was ignored by violators. No follow-up action. WE kept on complaining and even forwarded some photos also.
2. SEIZE order dated 16-02-2026 not enforced on ground. Construction


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 17-04-2026
www.mudranews.in | @mudranews



**వడదెబ్బ**
నీరు, ఉప్పు, నిమ్మరసం ఇవ్వాలి
చెమటతో పోయిన లవణాలు తిరిగి భర్తీ కావాలి. నిమ్మరసం + ఉప్పు కలిపిన నీరు మంచిది.

# ఎండ ప్రచండం..

- 12 జిల్లాలకు వాతావరణ శాఖ హై అలర్ట్



ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో ఎండలు ఉగ్రరూపం దాలుస్తున్నాయి. భానుడి ప్రతాపంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దీంతో వాతావరణ శాఖ గురువారం హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. వచ్చే రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీల వరకు పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉంది. ఆరెంజ్ హెచ్చరికలు ఉన్న జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యేల అనర్హతపై కౌంటర్ దాఖలు చేయండి

- స్పీకర్ సహా 9 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశాలు
- ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ సవాలు..
- వచ్చే నెల 6కు విచారణ వాయిదా వేసిన కోర్టు




ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలను హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, సంజయ్, తెల్లం వెంకట్రావుతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణ వచ్చే నెల 6వ తేదీకి వాయిదా వేసింది.

## హైకోర్టుకు బీఆర్ఎస్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, డా. సంజయ్, దానం, కడియం ఆ తరువాత కాంగ్రెస్ గూటికి చేరారని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపిస్తూ వీరిపై వేటు వేయాలని సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పీకర్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన స్పీకర్ వీరంతా పార్టీ మారడానికి సరైన ఆధారాలు లేవంటూ ఈ పదిమందికి క్లీన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇందులో గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్ తో సన్నిహితంగా ఉంటున్న నేపథ్యంలో ఆయన పేరును తమ పిటిషన్ లో పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ జరిపిన హైకోర్టు గూడెం మినహా మిగతా 9 మంది ఎమ్మెల్యేలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది.

# ప్రియుడి కోసం.. సుపారీ ఇచ్చి భర్త హత్య


సుమన్ (ఫైల్)

ముద్ర డెస్క్ :

తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో ఓ వివాహిత.. ప్రియుడు, మరికొందరితో కలిసి తన భర్తను కడతేర్చిన ఘటన హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. పరకాల పట్టణానికి చెందిన మడికొండ సుమన్(35) స్థానిక ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య లావణ్యకు కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండటంతో ఇంట్లో పలుమార్లు గొడవలు జరిగాయి.

కొద్ది రోజుల కిందట లావణ్య.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. ఈనెల 3న ఆమె భర్త సుమన్ కనిపించకుండా పోయారు. మృతుడి తండ్రి సాంబయ్య నాలుగైదు రోజులపాటు వెతికినా కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో 8న పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు భార్య లావణ్యపై పోలీసులకు అనుమానం రావడంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా ఈనెల 4న కొందరితో కలిసి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దయ్యాలవాగు సమీపంలో సుమన్‌పై పెట్రోల్ పోసి చంపినట్లు తేలింది. అక్కడికి వెళ్లిన పరకాల పోలీసులు.. 8 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లావణ్య, ఆమె ప్రియుడు కలిసి గోవిందరావుపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులతో సుపారీ మాట్లాడుకొని సుమన్‌ను హతమార్చినట్లు సమాచారం. దీనిపై విచారణ జరుగుతోందని.. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పరకాల సీఐ క్రాంతికుమార్ వివరించారు.

# స్వీయ జనగణనలో నమోదు చేసుకున్న సీఎం

- భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపు



ముద్ర, అమరావతి:

రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్–హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఈరోజు ప్రారంభమైంది. se.census.gov.in వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జన గణన డైరెక్టర్ జె.నివాస్ సీఎంకు వివరించారు. ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# చేనేత సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం



ముద్ర, హైదరాబాద్:

నాంపల్లిలోని చేనేత భవన్ కమిషనర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు కమిషనర్ శైలజా రామయ్యర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. కమిషనర్‌తో సుమారు 40 నిమిషాల పాటు వివిధ సమస్యలపై వారు చర్చించారు. టెండర్ విధానాన్ని రద్దు చేసి టెస్కో ద్వారా మాత్రమే వస్త్రాల కొనుగోలు జరపాలని కోరగా, దీనిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని కమి షనర్ తెలిపారు. ప్రస్తుత టెండర్ ప్రక్రియ త్వరలో ఖరారయ్యే అవకాశముందని చెప్పారు. సహకార సంఘాలకు సంబం ధించిన క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేయాలని కోరగా, ఈ అంశాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రామన్నపేట మండ లం సిరిపురం గ్రామానికి చెందిన మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేయగా, కమి షనర్ సానుకూలంగా స్పందించారు. జియోట్యాగ్ ఉన్న కార్మికులకు త్రిఫ్ట్ పథకం అమలు తదితర అంశాలను ప్రతినిధులు ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ముద్ర, కూకట్‌పల్లి:

కైతలాపూర్ డంపింగ్ యార్డ్‌లోని చెత్త కుప్పలో బుధవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు 45 నుండి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. నరసింహ అనే వ్యక్తి డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడు ఎవరనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

# యాదాద్రి నరసింహ స్వామికి నిత్య పూజలు

- స్వామివారి నిత్య రాబడి. రూ.12.82 లక్షలు



ముద్ర, యాదగిరిగుట్ట:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో ఆలయ అర్చకులు నిత్య ఆరాధన లు నిర్వహించారు. గురువారం ఆలయంలో జరిగే సువర్ణ పుష్పార్చన నిత్య కళ్యాణం వేద ఆశీర్వచనం సాయంత్రం జరిగిన వెండి మొక్కు జోడి సేవలు కొండ కిందగల సత్యనారాయణ స్వామి వ్రతాలలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కొండపైన అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు. అనుబంధ ఆలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి భక్తు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడిలో భాగంగా గురువారం రోజున రూ.12,82,284 లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ప్రశాంత్ చార్యులు రామాచార్యులు ఇన్చార్జి వెంకటేష్ ఎస్పీఎఫ్ సిబ్బంది మాణిక్ ప్రభు మోహన్ రెడ్డి పాండు సూర్య నాయక్, దేవస్థాన సిబ్బంది కుమార్ భక్తులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ లో మహిళా వాటా తగ్గితే మరో ఉద్యమం

- లోక్ సభలో 3.13 శాతం సీట్ల ప్రాతినిధ్యం కొనసాగాలి
- కేంద్రానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక



ముద్ర, తెలంగాణ బ్యూరో:

నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం కుట్రలు సాగనివ్వమంటూ గురువారం వీడియో సందేశం విడుదల చేశారు. తెలంగాణకు, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తామంటే ఉరుకునేదే లేదని తేల్చి చెప్పారు. మరో తెలంగాణ ఉద్యమం మాదిరిగా ఉద్యమాన్ని చేపడతామని కేంద్రాన్ని హెచ్చరించారు. మహిళ బిల్లుకు డీలిమిటేషన్ ను లింక్ చేయటాన్ని తప్పు పట్టారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే మహిళ బిల్లుకు బీసీ సబ్ కోటాను లింక్ చేయాలని సూచించారు. ప్రస్తుతం పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని చెప్పారు. డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన తీసుకున్నా సరే తెలంగాణ ప్రాతినిధ్యం ఏ మాత్రం తగ్గొద్దని తేల్చి చెప్పారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెంచుతామంటూ ప్రతిపాదించటం కూడా సరైన పద్ధతి కాదని కవిత అన్నారు. ఉదాహరణకు బీహార్ తో పోల్చుకుంటే తెలంగాణలో పెరిగే సీట్లకు చాలా అంతరం ఉంటుందన్నారు.

న్యాయమైన డిమాండ్ల సాధ న కోసం సమ్మె చేస్తున్న ఆర్టిజన్లపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడటం దారుణమని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న వారిని డిస్మిస్ చేస్తామని బెదిరించటమంటే వారి ప్రాథమిక హక్కులను హరించటమేనని మండిపడ్డారు. ఆర్టిజన్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా జాగృతి ఉంటుందని స్పష్టం చేశారు.

### ఎంపీ తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలి

తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా మాట్లాడిన తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ సమాజానికి జరిగిన అవమానమని అన్నారు. ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తారా అంటూ ప్రశ్నించారు. వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండించి తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే పదవులకు రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాశీ పర్యటనలో ఉన్న ఆమె అక్కడి నుంచి ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా, పాకిస్తాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్నే కాకుండా తెలంగాణ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను కూడా తేజస్వీ అవమానించారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడిన సరే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైసీపీ

- మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి

ముద్ర, అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేయడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అంశంపై వైసీపీ చేస్తున్న ఆరోప ణలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రైవేటు పరంగా మార్చుతున్నారన్న ప్రచారం వాస్తవానికి విరుద్ధమని, మొత్తం 114 ఎకరాల్లో కేవ లం 7 ఎకరాలు మాత్రమే ఒక సంస్థకు కేటాయించామని తెలిపారు. మత్స్యకారు లకు ఎలాంటి నష్టం జరగదని, పైగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటాన్ని చూసి ప్రతిపక్షం ఓర్వలేక దుష్ప్రచారం చేస్తోందని మంత్రులు ఆరోపించారు. దేశంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్ర దేశ్ ముందంజలో ఉందని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు మాత్రం రాజకీయ లాభం కోసం మత్స్యకా రులను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో గతంలో కీలక ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. మత్స్యకారుల సంక్షేమం, తీర ప్రాంత అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఫిషింగ్ హార్బర్లు, పోర్టుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని మంత్రులు స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుతో నవశకం

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



ముద్ర, న్యూఢిల్లీ:


మహిళా సాధికారతకు కీలకంగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ బిల్లు అన్ని పార్టీల మద్దతుతో ఆమో దం పొందుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2029 నుంచే 33% మహిళా రిజర్వేషన్లు అమల్లోకి తీసుకు రావాలని కేంద్రం నిర్ణయించిందని, ఇది మహిళల రాజకీయ భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక అడుగుగా ఆయన పేర్కొన్నారు. నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల దేశాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. డీలిమిటేషన్‌పై వస్తున్న అను మానాలు అవసరం లేదని, రాజ్యాంగ బద్ధంగా ప్రక్రియ జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా బిల్లుకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
17.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



వడదెబ్బ : శరీర లక్షణాలు గమనించాలి

తలనొప్పి, నీరసం,
చెమట తగ్గడం,
ముదురు మూత్రం —
ఇవి ప్రమాద
సంకేతాలు.



# "ఆరెంజ్" విరాట్..




ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
అదే ఫిట్నెస్.. అదే యాంగ్రీ నెస్.. అదే అగ్రెసివ్నెస్.. సంవత్సరం మారుతోంది. ఆడే వేదిక మారుతుంది. ఆ మనిషికి వయసు కూడా పెరుగుతోంది. కానీ ఆట తీరు అంతకుమించి అనే స్థాయిలో ఎదుగుతోంది. పరుగులు తీయడంలో.. పరాక్రమాన్ని ప్రదర్శించడంలో.. దూకుడుగా ఆడటంలో.. అతడు అంతకుమించి అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నాడు. అందువల్లే నేటి కాలంలో కూడా పరుగుల యంత్ర గాడు అనే బిరుదును తనకు మాత్రమే సొంతమని.. అది తనకు పాదాక్రాంతమని నిరూపిస్తున్నాడు. ఐపీఎల్ లో ఈ సీజన్లో ఇప్పటివరకు ఆరెంజ్ క్యాప్ హోల్డర్ గా నిలిచిన వారంతా యంగ్ ప్లేయర్లు. ఇందులో 15 సంవత్సరాల వైభవ్ సూర్య వంశీ నుంచి మొదలు పెడితే ఇషాన్ కిషన్ వరకు అందరూ యువ రక్తం ఉన్నవారే. కానీ వారందరిని దాటుకొని.. నేనున్నాను.. నేను మాత్రమే ఉన్నాను అన్నట్టుగా దూసుకు వచ్చాడు విరాట్ కోహ్లీ. బుధవారం లక్నో జట్టుతో జరిగిన మ్యాచ్లో 49 పరుగులు చేయడం ద్వారా.. ఆరెంజ్ క్యాప్ బిరుదాంకితుడయ్యాడు. ప్రస్తుత ఐపిఎల్ లో ఐదు మ్యాచ్లు ఆడిన విరాట్ కోహ్లీ.. 228 పరుగులు చేశాడు. 57 సగటు, 158.33 స్ట్రైక్ రేట్ తో కొనసాగుతున్నాడు. ఇతడి బ్యాట్ నుంచి 25 ఫోర్లు, 8 సిక్సర్లు వచ్చాయి.. ఇతడి తర్వాత స్థానంలో క్లాసెన్ 224( సన్ రైజర్స్), పాటిదార్222( బెంగళూరు) కొనసాగుతున్నారు. బుధవారం నాటి లక్నో మ్యాచ్లో విరాట్ కోహ్లీ (49) ఒక్క పరుగు తేడాతో హాఫ్ సెంచరీ కోల్పోయాడు. అయినప్పటికీ బెంగళూరు జట్టు సాధించిన విజయంలో కీలకపాత్ర పోషించాడు. వికెట్లు పడుతున్నా.. అతడు ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. లక్నో బౌలర్ల పై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. తద్వారా తనకు వయసు అనేది లెక్క కాదని.. తన ఫిట్నెస్ ఎప్పటికీ యంగ్ గానే ఉంటుందని నిరూపించాడు.ఇటీవల జరిగిన మ్యాచ్ లో విరాట్ కోహ్లీ కాస్త అసౌకర్యంగా కనిపించాడు. మైదానంలో ఫీల్డింగ్ చేసేందుకు రాలేదు. దీంతో విరాట్ కోహ్లీ పని అయిపోయిందని ప్రచారం మొదలైంది. కొందరు అతడు 2027 వరల్డ్ కప్ ఆడలేడని స్పష్టం చేశారు. అతడికి మునుపటి మాదిరిగా బ్యాటింగ్ చేసే సామర్థ్యం లేదని కామెంట్లు మొదలుపెట్టారు. కానీ వారందరికీ తన బ్యాట్ తోనే సమాధానం చెప్పాడు విరాట్ కోహ్లీ. తనను పరుగుల చీతా అని.. రన్ మిషన్ అని ఎందుకు పిలుస్తారో మరోసారి నిరూపించాడు.




## రెండోసారి ఐపీఎల్ ట్రోఫీ కోసం రెడీ..

ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
క్రికెట్లో గెలవాలంటే చాలా రకాలైన వ్యూహాలు అమలు చేయాలి. మైదానం లోకి అడుగు పెట్టకముందు రచించే వ్యూహాలు ఒక విధంగా ఉంటాయి. మైదానంలో అడుగుపెట్టిన తర్వాత.. అప్పటికప్పుడు రూపొందించే ప్రణాళికలు మరో విధంగా ఉంటాయి. అంతిమంగా ఇవన్నీ కూడా విజయానికి దోహదం చేయాలి. అప్పుడే రూపొందించిన ప్రణాళికలకు అర్థం ఉంటుంది.. ప్రస్తుత ఐపిఎల్ లో బెంగళూరు జట్టు ఇదే విధమైన ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్లాన్ ఏ తోపాటు ప్లాన్ బి కూడా అమలు చేస్తోంది. అందువల్లే ఆ జట్టు వరుస విజయాలు సాధిస్తూ.. అదరగొడుతోంది. ఇప్పుడు వరకు కేవలం ఒకే ఒకే మ్యాచ్లో మాత్రమే బెంగళూరు ఓడిపోయింది. బెంగళూరులో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. బ్యాటింగ్ పరంగా డోకా లేదు. బౌలింగ్ పరంగా ఇబ్బంది లేదు. ఫీల్డింగ్ పరంగా వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. ఒక విఫలమైనా సరే, మిగతావారు జట్టు భారాన్ని మోస్తున్నారు.. జట్టును ముందుండి నడిపిస్తున్నారు. అందువల్లే బెంగళూరు జట్టు ఏమాత్రం తడబాటుకు గురి కావడం లేదు. వెనకడుగు వేయడం లేదు. బ్రేకులు లేని బుల్డోజర్ లాగా దూసుకుపోతోంది. ఇప్పటివరకు బెంగళూరు ఐదు మ్యాచ్ లు ఆడింది. ఇందులో రాజస్థాన్ జట్టు దగ్గర మ్యాచ్ లో ఓడిపోయింది. మిగతా వాటిలో ప్రత్యర్థి జట్ల అంచనాలకు ఏమాత్రం అందకుండా బెంగళూరు బ్యాటింగ్ చేసింది. బౌలింగ్ కూడా అదే స్థాయిలో చేసింది. అందువల్లే విజయాలు అందుకుంది. తాజాగా లక్నో జట్టుతో జరిగిన మ్యాచ్ లో బెంగళూరు అన్ని రంగాలలో ప్రతిభ చూపించింది. బౌలింగ్లో అదరగొట్టింది. బ్యాటింగ్లో సత్తా చూపించింది. ఫీల్డింగ్ లో అయితే కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అందువల్లే లక్నో జట్టు తక్కువ స్కోరు చేయగలిగింది. ఈ స్థాయిలో ఆడింది కాబట్టి బెంగళూరు..తన ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసుకుంది. అద్భుతంగా ఆడుతున్న బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఇక ఇప్పటివరకు మ్యాచ్లలో బెంగళూరు జట్టు నుంచి.. నలుగురు ప్లేయర్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు సొంతం చేసుకున్నారు. తొలి మ్యాచ్లో జాకబ్ డఫి.. మరో మ్యాచ్లో డేవిడ్.. ఇంకో మ్యాచ్లో సాల్ట్.. తాజా మ్యాచ్లో హెజెల్ వుడ్ మెన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారాలు అందుకున్నారు. డిఫరెంట్ ఆట తీరుతో ఆకట్టుకుంటున్న బెంగళూరు జట్టు.. ఈసారి కూడా ట్రోఫీ అందుకుంటుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.

## ధోని చివరి సీజనా..?



ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
భారత క్రికెట్ చరిత్రలో అజరామరమైన పేరు మహేంద్ర సింగ్ ధోని. ఇప్పుడు 44 ఏళ్ల వయసులోనూ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కొనసాగుతున్నాడు. ఈ వయసులో ఇంతకాలం ఐపీఎల్ ఆడిన భారత స్టార్ ఆటగాడు ఇంకెవ్వరూ లేరు. అందుకే ప్రతి సీజన్ ప్రారంభమైతే ఒకే ప్రశ్న— "ఇదేనా ధోని చివరి సీజన్?"

**గాయం చుట్టూ గందరగోళం**
ఈసారి పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. సీజన్ ప్రారంభానికి గంటల ముందు చెన్నై సూపర్ కింగ్స్ ధోని గాయంపై ప్రకటన చేయడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. రెండు వారాలు దూరంగా ఉంటాడని చెప్పినా, మూడు వారాలు గడిచినా ఇంకా మైదానంలోకి రాలేదు. దీనితో గాయం నిజమేనా? లేక మరేదైనా వ్యూహమా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

**ఫిట్నెస్ vs అనుభవం**
ధోని ఫిట్‌నెస్ గురించి గత కొన్నేళ్లుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. మోకాలి శస్త్రచికిత్స తర్వాత అతని బ్యాటింగ్ ప్రభావం తగ్గినట్లు స్పష్టమే. అయితే వికెట్ కీపింగ్‌లో మాత్రం ఇప్పటికీ చురుకుదనం చూపిస్తున్నాడు. జట్టుకు భారంగా కాకుండా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తూ తన పాత్రను మార్చుకున్నాడు.

**రుతురాజ్‌కు పగ్గాలు.. మారుతున్న సమీకరణలు**
2023లో టైటిల్ గెలిపించిన తర్వాత కెప్టెన్సీని రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించడం పెద్ద సంకేతమే. అప్పట్లోనే ధోని రిటైర్మెంట్ ఖాయం అనుకున్నారు. కానీ అతను మళ్లీ బరిలోకి దిగడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. ఇప్పుడు మాత్రం పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**అభిమానుల భావోద్వేగం**
సీఎస్కే అంటే ధోని.. ధోని అంటే సీఎస్కే. అతను మైదానంలో ఉంటే చాలు స్టేడియం మొత్తం పసుపు సముద్రంలా మారిపోతుంది. అతని కోసం మాత్రమే మ్యాచ్‌లకు వచ్చే అభిమానులు లక్షల్లో ఉంటారు. అలాంటి ఆటగాడు ఒక్కసారిగా రిటైర్ అయితే ఆ ఖాళీని భర్తీ చేయడం సులభం కాదు.

**ఇది వ్యూహాత్మక విరామమా?**
ధోని గాయం నిజమేనా? లేక అభిమానులను మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నమా? అనే చర్చ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకేసారి రిటైర్మెంట్‌తో అభిమానులు షాక్‌కు గురవుతున్నారని భావించి, క్రమంగా దూరమవుతున్నాడనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**చివరి మ్యాచ్‌ల్లోనే వీడ్కోలేనా?**
ఈ సీజన్‌లో పరిమిత మ్యాచ్‌లు మాత్రమే ఆడి, చెన్నై ప్రేక్షకుల ముందే రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు నిర్ధారించారు. అయితే జట్టు ప్రదర్శన కూడా కీలకం. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ స్థిరంగా ఆడటం లేదు. ఈ పరిస్థితుల్లో ధోని తిరిగి వస్తాడా? ప్రభావం వస్తే చూపగలడా? అన్నది ఆసక్తికరంగా మారింది.
ధోని కెరీర్ ఎప్పుడూ అప్రతిభటంగా సాగింది. అతని నిర్ణయాలు కూడా అలాగే ఉంటాయి. కాబట్టి రిటైర్మెంట్ విషయంలోనూ చివరి వరకూ ఉత్కంఠ కొనసాగడం ఖాయం. కానీ ఒక్క విషయం మాత్రం నిజం— ధోని మైదానం విడిచిన రోజు, ఐపీఎల్‌లో ఒక యుగం ముగుస్తుంది.

## ఎస్.ఆర్.హెచ్ కు గుడ్ న్యూస్..




ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
ఇటీవల రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్లో సన్ రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. ముఖ్యంగా బౌలింగ్లో సత్తా చూపించింది. ప్రస్తుత ఐపీఎల్ లో హైదరాబాద్ జట్టు అద్భుతంగా బౌలింగ్ చేయడం ఇదే తొలిసారి. దీంతో ఒక్కసారిగా ఆ జట్టు ఆట తీరుపట్ల అంచనాలు పెరిగిపోయాయి. అంతగా ఆకట్టుకోలేకపోతున్న బౌలర్లను దూరం పెడుతున్న మేనేజ్మెంట్.. సంచలన ఆట తీరుతో ఆకట్టుకునే బౌలర్లకు అవకాశం కల్పిస్తోంది. రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్లో విజయం సాధించిన నేపథ్యంలో.. హైదరాబాద్ జట్టుమీద అంచనాలు పెరిగిపోయాయి. తన తదుపరి మ్యాచ్ చెన్నై జట్టుతో హైదరాబాద్ ఆడుతుంది. ఈ క్రమంలోనే ఆటగాళ్లు మైదానంలో తీవ్రంగా సాధన చేస్తున్నారు. మరి కొంతమంది కొత్త బౌలర్లను జట్టులోకి ప్రవేశపెట్టాలని.. వారిలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి అవకాశం కల్పించాలని మేనేజ్మెంట్ భావిస్తోంది. ఈ కసరత్తు ఇలా సాగుతుండగానే హైదరాబాద్ జట్టుకు శుభవార్త అందింది. హైదరాబాద్ జట్టులో ఒకప్పుడు కీలక బౌలర్ గా.. సారథిగా కమిన్స్ ఉండేవాడు. అయితే గాయం వల్ల ఇప్పటివరకు ఒక మ్యాచ్ కూడా అతడు ఆడలేదు. అతడి బదులుగా ఇషాన్ కిషన్ తాత్కాలిక సారథిగా వ్యవహరిస్తున్నాడు. కిషన్ నాయకత్వంలో ఐదు మ్యాచ్లు ఆడిన హైదరాబాద్.. రెండిట్లో గెలిచింది. పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో గాయంతో ఇబ్బంది పడుతున్న కమిన్స్ త్వరలోనే జట్టులో చేరుతాడని వార్తలు వినిపిస్తున్నాయి. అతని రాకకు సంబంధించి ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ నుంచి సమ్మతి లభించిందని.. త్వరలోనే అతడు జట్టుతో ప్రయాణాన్ని మొదలుపెడతాడని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అదే గనక నిజమైతే.. హైదరాబాద్ జట్టు బౌలింగ్ బలం మరింత పెరుగుతుంది.. ప్రస్తుతం యువకులు సంచలనం సృష్టిస్తున్నారు. ఇటీవల రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్లో ఇద్దరు పేస్ బౌలర్లు చెరి నాలుగు వికెట్లు సొంతం చేసుకున్నారు. వారికి కమిన్స్ అనుభవం తోడైతే హైదరాబాద్ జట్టుకు అడ్డు ఉండదు. తదుపరి మ్యాచ్లో కూడా ఇదే జోరు కొనసాగించాలని హైదరాబాద్ జట్టు భావిస్తోంది. ప్రస్తుతానికి అయితే హైదరాబాద్ జట్టుకు అన్ని మంచి శకునమలే కనిపిస్తున్నాయి. అప్పుడెప్పుడో హైదరాబాద్ టు ఐపీఎల్ ట్రోఫీ గెలిచింది. 2024లో ఫైనల్ వెళ్లినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఈసారైనా ఫైనల్ వెళ్లి ట్రోఫీ అందుకోవాలని హైదరాబాద్ అభిమానులు బలంగా

## బీసీసీఐకి కొత్త తలనొప్పి..

ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత.. టీమ్ఇండియా తొలి పర్యటనగా ఐర్లాండ్‌కు వెళ్లనుంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించడం దాదాపు ఖాయమేనని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇక్కడే మేనేజ్‌మెంట్‌కు ఓ కఠిన సవాల్ ఎదురుకానుంది. అదే వైభవ్‌ను ఎక్కడ ఆడించాలి? ఎవరిని పక్కన పెట్టాలి? అని తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదు. టీ20 సిరీస్ కోసం ఐర్లాండ్‌కు పంపించే ఆటగాళ్ల షార్ట్ లిస్ట్‌లో వైభవ్ సూర్యవంశీకి బీసీసీఐ చోటు దని వార్తలు వచ్చాయి. అయితే, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపిక చేసే అవకాశం లేదు. ఇప్పటికే బీసీసీఐ లాజిస్టిక్స్ విభాగం నుంచి సమాచారం వచ్చింది. ఐరిష్ వీసాలు ఎవరెవరికి అవసరమనే జాబితాను పంపించాలని సెలక్షన్ కమిటీని అడిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జట్టులో నలుగురు టాప్ ఓపెనర్లు ఉన్నారు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్ రూపంలో దూకుడుగా ఆడే క్రికెటర్లు ఉన్నారు. ఇప్పుడు వైభవ్‌ను తీసుకొస్తే.. వీరిలో ఎవరిని తప్పిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అభిషేక్ ఎలాగూ ఓ వైపు తన ప్లేస్‌ను ఫిక్స్ చేసేసుకున్నాడు. ఇక రెండో ఓపెనర్‌గా వైభవ్ వస్తే మేనేజ్‌మెంట్‌కు కఠిన సవాల్ తప్పదు. ఐర్లాండ్‌తో సిరీస్ కాబట్టి.. ఇప్పటికైతే సంజు, ఇషాన్‌ను పక్కనపెట్టినా పెద్ద ఇబ్బంది ఉండదు. వీరిద్దరూ వన్‌డౌన్‌లోనూ ఆడగల సమర్థులే. మరోవైపు టీ20 ప్రపంచ కప్‌ను గెలిపించిన సారథి సూర్యకుమార్ బ్యాటర్‌గా విఫలమై నిరాశపరిచాడు. అతడికీ చోటు దక్కడం కష్టమేనని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

**అభిషేక్ లేదా సంజుకు కెప్టెన్సీ?**
ఇప్పుడు సెలక్షన్ కమిటీ ముందు మరో సమస్య వేధిస్తోంది. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్‌ను పక్కనపెడితే.. ఐర్లాండ్‌తో టీమ్ఇండియాను నడిపించే బాధ్యతను అభిషేక్ శర్మ లేదా సంజు శాంసన్‌కు దక్కే అవకాశం లేకపోలేదు. ఒకవేళ వైభవ్‌కు స్థానం కల్పించేందుకు వీరిద్దరినీ పక్కనపెడితే.. అందుకు తగిన కారణం చెప్పాల్సిన బాధ్యత బీసీసీఐపై ఉంది.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శుక్రవారం 17.04.2026

www.mudranews.in | @mudranews



**వడదెబ్బ :**

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి.ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం3.00 గంటల మధ్య బయటకు వెళ్లకూడదు, గొడుగు/టోపీ వాడాలి, లేత రంగు దుస్తులు ధరించాలి



# ప్రమోషన్లు ముగిశాయి.. ఫలితం మీదే ఆశలు

**ముద్ర, సినిమా డెస్క్ :**

నేడు థియేటర్లలో విడుదల కాబోతున్న కొత్త సినిమాల ప్రమోషన్ కార్యక్రమాలు దాదాపు ముగిశా యి. ప్రతి చిత్ర బృందం తమ తమ సినిమాలపై ప్రేక్ష కుల దృష్టిని ఆకర్షించేందుకు శక్తిమేరకు ప్రచారం చేసింది. చిన్న సినిమాగా వస్తున్న 'తిమ్మరాజుపల్లి టీవీ' కోసం హీరో కిరణ్ అబ్బవరం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విస్తృతంగా ప్రమోషన్లు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రసాద్ బిగ్ స్క్రీన్‌లో ప్రీమియర్ షో నిర్వహించడం ద్వారా ప్రచారానికి ఫైనల్ టచ్ ఇచ్చారు. ఈవెంట్లు, ఇంటర్వ్యూలు, సోషల్ మీడి యా పోస్టులతో ఈ సినిమా బజ్ పెంచే ప్రయత్నం కనిపించింది. అదే సమయంలో 'పాపం ప్రతాప్' కూడా ప్రచారంలో వెనుకడుగు వేయకుండా దూకుడుగా ముందుకెళ్లింది. హీరో తిరువీర్ గత రెండు వారాలుగా నిరంతరం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశాడు. ఈటీవీ విన్ మద్దతుతో ఈ చిత్రానికి మంచి ప్రమోషనల్ సపోర్ట్ లభించింది. ముఖ్యంగా కథలోని కీలక ట్విస్ట్‌ను విడుదలకు ముందు సోషల్ మీడియాలో వెల్లడించడం ద్వారా మరింత ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. మలయాళం నుంచి డబ్బింగ్‌గా వస్తున్న 'పల్లిచట్టంబి' మాత్రం ఇప్పటి వరకు పెద్దగా బజ్ సృష్టించలేకపోయింది. నాగ శౌర్య నటించిన 'బ్యాడ్ బాయ్ కార్తీక్' కూడా ఇదే వారం విడుదలవుతున్నప్పటికీ, ప్రమోషన్ల విషయం లో మిగతా సినిమాలంత హైప్ కనిపించలేదు. ట్రైల ర్, ప్రీ రిలీజ్ ఈవెంట్ పెద్దగా ప్రభావం చూపక పోయినా, సినిమా థియేటర్లో సర్ప్రైజ్ ఇస్తుందనే నమ్మకంతో నిర్మాతలు ఉన్నారు. ఇక బాలీవుడ్ నుంచి అక్షయ్ కుమార్ నటించిన 'భూత్ బంగ్లా'కు ఈరోజు రాత్రి నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి. అలాగే హారర్ జానర్‌లో 'లీ క్రోనిన్ మమ్మీ'పై ప్రేక్షకుల్లో కొంత ఆసక్తి నెలకొంది. ఇవి కాకుండా 'మిస్టర్ ఎక్స్', 'తెరచాప', 'కాలగమనం', 'గాలి' వంటి మరికొన్ని చిన్న చిత్రాలు కూడా అదే రోజున విడుదలకు సిద్ధమయ్యాయి. సినిమాల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, బుక్ మై షోలో ఏ ఒక్క చిత్రం కూడా ఇంకా ట్రెండింగ్‌లోకి రాకపోవడం గమనార్హం. దీని ద్వారా ప్రేక్షకులు రివ్యూలు, టాక్ కోసం వేచి చూస్తున్నారని అర్థమవుతోంది.







## తమన్నాకు కోర్టులో నిరాశ.. పవర్ సోప్స్‌పై పిటిషన్ తిరస్కరణ

**ముద్ర, సినిమా డెస్క్ :** నటి తమన్నా భాటియా దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 'పవర్ సోప్స్' కంపెనీపై ఆమె చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు సమ ర్పించలేకపోయినందున, కోర్టు ఆ పిటిషన్‌ను తిర స్కరించింది.

ఇద్దరి మధ్య 2008లో బ్రాండ్ ప్రమో షన్‌కు సంబంధించిన ఒప్పందం కుది రింది. ఆ ఒప్పందం ప్రకారం 2009 అక్టోబ ర్ వరకు మాత్రమే తమన్నా ఫోటోలను కంపెనీ ఉపయోగిం చుకోవాల్సి ఉంది. అయితే గడువు ముగిసిన తర్వాత కూడా 2010-2011 మధ్య తన చిత్రాలను అను మతి లేకుండా వినియోగించారని తమన్నా ఆరోపించారు. ఈ నేపథ్యంలో కంపెనీపై చర్యలు తీసుకోవాలని, అలాగే తన ఫోటోలను ఇకపై ఉపయోగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన ఆమె, రూ.కోటి నష్టపరి హారం కూడా కోరారు. ఈ కేసులో ముందుగా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆమె మరో పిటిషన్ దాఖలు చేశారు.

అయితే, ఆ అప్పీల్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసనం, సింగిల్ జడ్జి తీర్పునే సమర్థిస్తూ తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ వ్యవ హారంలో ఆమెకు న్యాయపరంగా ఎదురుదెబ్బ తగి లినట్లైంది.





# 22 ఏళ్ల తర్వాత సూర్య-త్రిష జోడీ..

**ముద్ర, సినిమా డెస్క్ :**

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'కరుప్పు'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురో జుకూ పెరుగుతోంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ సినిమాకు మంచి క్రేజ్ ఏర్పడింది. తెలుగులో ఈ చిత్రాన్ని 'వీరభద్రుడు' అనే శక్తివంత మైన టైటిల్‌తో విడుదల చేయాలని నిర్ణయించారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా విడు దలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు ఆర్జే బాలాజీ తాజాగా మీడియాతో మాట్లాడిన సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడిం చారు. ఈ చిత్రంలో సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కథా నాయికగా నటిస్తుండగా, సూర్య-త్రిష జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని కలిగిస్తోంది. గతంలో 'ఆరు' సినిమాలో కలిసి నటించిన ఈ జంట, దాదాపు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిసి నటించడం విశేషం. త్రిషతో పని చేయడం గురించి బాలాజీ మాట్లాడుతూ, చాలా కాలంగా ఆమెతో సినిమా చేయాలనుకున్నానని, ఈ ప్రాజెక్ట్ ద్వారా అది సాకారమైందని తెలిపారు. కథ వినగానే త్రిష వెంటనే అంగీకరించిందని, షూటింగ్ పూర్తయ్యాక కూడా ఆమె తరచూ సెట్స్‌కు వచ్చి యూనిట్‌ను ప్రోత్సహించిందని చెప్పారు. ఇక ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా మొదట ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌ను ఎంపిక చేసినప్ప టికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని బాలాజీ వెల్లడించారు. 'మూకుతి అమ్మన్' తర్వాత కలిసి పని చేయాలని నిర్ణ యించుకున్నప్పటికీ, 'కరుప్పు' షూటింగ్ సమయంలో ఆయన పూర్తి సమయం కేటాయించలే నని చెప్పడంతో నిరాశ కలిగిందని పేర్కొన్నారు. అయితే మధ్యలో ఒక పాట అత్యవసరం కావడంతో, సాయి అభ్యంకర్‌ను సంగీత దర్శకుడిగా తీసుకున్నా మని తెలిపారు.

## ఫొటో షూట్లతో దుమ్మురేపుతున్న

# డింపుల్ హయాతి

**ముద్ర, సినిమా డెస్క్ :**

తెలుగు, తమిళ చిత్రాల్లో 2017 నుంచి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న నటి డింపుల్ హయాతి, ఇప్పటివరకు పెద్ద హిట్ సాధించకపోయినా తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. సినిమాల కంటే ఆమె స్టైల్, గ్లామర్ కారణంగానే సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చకు వస్తోంది.

తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డార్క్ బ్రౌన్ లేస్ దుస్తుల్లో కనిపించిన డింపుల్ ఎంతో హాట్‌గా, ఆకర్షణీయంగా కనిపించింది. వదిలేసిన కర్లీ జుట్టు, ఎక్స్‌ప్రెసివ్ కళ్ల చూపులు, కూల్‌గా కనిపించే ఆమె అటిట్యూడ్ అన్నీ కలిపి ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఎటువంటి ప్రత్యేక సందర్భం లేకపోయినా, కేవలం తన లుక్‌తోనే డింపుల్ హయాతి సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. గ్లామర్, కాన్ఫిడెన్స్ కలయికతో ఆమె అభిమానులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది



# పెద్ది'లో మాస్ సాంగ్‌కు కొత్త గ్లామర్.. ఆయేషా ఖాన్ ఎంట్రీ?

**ముద్ర, సినిమా డెస్క్ :**


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై మరో ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలో ప్రత్యేకంగా రూపొందిస్తున్న మాస్ మసాలా పాట కోసం బాలీవుడ్ యంగ్ నటి ఆయేషా ఖాన్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఇటీవల 'ధురంధర్' సినిమాలోని 'షరారత్' పాటతో సోషల్ మీడియాలో విపరీతమైన గుర్తింపు పొందిన ఆయేషా, తన డ్యాన్స్ మరియు గ్లామర్‌తో యూత్‌ను ఆకట్టుకుంది. ఆ పాటలో ఆమె ప్రదర్శన చూసిన దర్శకుడు బుచ్చిబాబు, రామ్ చరణ్ సరసన ప్రత్యేక సాంగ్‌కు ఆమెనే సరైన ఎంపికగా భావించినట్లు తెలుస్తోంది. చరణ్ వంటి ఎనర్జిటిక్ డ్యాన్సర్ పక్కన ఆయేషా ఉంటే, ఆ పాటకు మరింత క్రేజ్ రావడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఈ స్పెషల్ సాంగ్ కోసం మృణాల్ ఠాకూర్, మానస వారణాసి పేర్లు వినిపించినప్పటికీ, ప్రస్తుతం యువతలో ఉన్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయేషా ఖాన్ వైపు చిత్రబృందం మొగ్గు చూపినట్లు టాక్. ఈ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఊర మాస్ ట్యూన్ సిద్ధం చేస్తున్నారని, అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. మొదట ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమైన ఈ సినిమా, షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం కారణంగా జూన్ 2026కి వాయిదా పడింది. అయితే, ఈ గ్యాప్‌లో వస్తున్న అప్‌డేట్లు మెగా అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయేషా ఖాన్ స్పెషల్ సాంగ్ ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## ఆన్ స్క్రీన్ లోనే కాదు ఆఫ్ స్క్రీన్ లోనూ

# అనస్వర రాజన్ కేకే

### గిరగిరా తిరిగే అందంతో గిలిగింతలు



కేరళకు చెందిన యువ నటి అనస్వర రాజన్ ప్రస్తుతం మలయాళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతమైన నటీమణుల్లో ఒకరిగా గుర్తింపు పొందుతోంది. మోహన్‌లాల్‌తో కలిసి నటించిన 'నేరూ' చిత్రంతో మంచి బ్రేక్ సాధించింది. ఆ సినిమా లో తన అద్భుతమైన నటనకు ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ సహాయ నటి అవార్డు అందుకుని ప్రశం సలు దక్కించుకుంది.

తాజాగా అనస్వర పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ఆకర్షణగా మారాయి. ఐవరీ మరియు గోల్డ్ సీక్విన్ లెహంగాలో ఆమె కనిపించిన తీరు నిజంగా మంత్రముగ్ధులను చేస్తోంది. గిరగిరా తిరుగుతున్న క్షణంలో చేతులు చాపి, మెరిసే చిరునవ్వుతో కనిపించిన ఆమె లుక్ ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఆమె చుట్టూ తేలియాడే పలుచని దుపట్టా, చేతుల్లో ఎరుపు గాజులు, సహజమైన ఆనందం అన్నీ కలిపి ఆ ఫోటోలను ఒక వేడుకలా మార్చేశాయి. క్లోజప్ షాట్స్‌లో కనిపించే ఆమె లోతైన కళ్ల చూపులు ఇప్పటికే పలుభాషల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనస్వర, ఆన్ స్క్రీన్‌లో మాత్రమే కాదు, ఆఫ్ స్క్రీన్‌లో కూడా తన అందం, గ్రేస్‌తో అభిమానులను మెప్పిస్తోందని ఈ ఫోటోలు స్పష్టం చేస్తున్నాయి.

**- ముద్ర, సినిమా డెస్క్**

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderab
Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com